ఈనాడు ప్రకాశం
గురువారం 17 అక్టోబరు 2024



బైరవకోన ఆలయ సముదాయం వద్ద వరద నీటి ప్రవాహం

సీఎస్‌పురం: బైరవకోనలో కొండల పైనుంచి జాలువారుతున్న జలపాతం



తాళ్లూరు మండలం దారంవారిపాలెం- తూర్పుగంగవరం మధ్య వరద నీటి కోతకు గురైన కొండవాగు కల్వర్టు

నెత్తినే ఫ్లాష్ ఫ్లడ్ పిడుగు

- జిల్లాకు తొలగని వాయు'గండం'
- ఇప్పటికే కుండపోతగా వర్షాలు
- పొంగిన వాగులతో నిలిచిన రాకపోకలు
- లోతట్టు కాలనీల్లోకి వర్షపు నీరు



ప్రకాశానికి ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు ఇంకా తప్పలేదు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు'గండం'తో జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైకి 280 కి.మీ, నెల్లూరుకు 370 కి.మీ దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉంది. తీరం దాటే సమయంలో ఆ ప్రభావం జిల్లాపై పడనుంది. ఈ మేరకు కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని., ఫ్లాష్ ఫ్లడ్స్(ఆకస్మిక వరదలు) సంభవించే ప్రమాదముందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం మరోసారి అప్రమత్తమైంది. ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందనే సమాచారం మేరకు అర్ధవీడు, పెద్దదోర్నాల, కంభం, పెద్దారవీడు, మార్కాపురం, రాచర్ల, ముండ్లమూరు మండలాల్లో అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ సమయంలో ఇబ్బంది వచ్చినా తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించేలా సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

▶ **వెళ్లనీయని వాగులు...:** మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదులు, వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు వాహనాలతో పాటు, ప్రయాణికుల రాకపోకలు స్తంభించాయి. ▶ నాగులుప్పలపాడు మండలం చదలవాడలో రామన్న చెరువు కట్ట తెగి 216 జాతీయ రహదారి పైకి నీరు చేరడంతో చీరాల వైపు వెళ్లే వాహనాలను పాత బైపాస్ మీదుగా మళ్లించారు. ▶ ఒంగోలు మండలం కరవది- గుత్తికొండవారిపాలెం గ్రామాల మధ్య ఉన్న ముదిగొండ వాగు గత రెండు రోజులుగా ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ▶ ఒంగోలు- మంగమూరు మధ్య నల్లవాగు; టంగుటూరు- ఆలకూరపాడు; ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామం వద్ద చిలకలేరు వాగులదీ అదే పరిస్థితి. ▶ తాళ్లూరు మండలం విఠలాపురం వద్ద దోర్నపు వాగు చప్టాపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహన రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

▶ **222 మందికి పునరావాసం...:** ఒంగోలు నగరంలోని కేశవరాజుకుంట, బలరాం కాలనీ, భరత్ కాలనీ, నెహ్రూనగర్, నేతాజీ, మదర్ థెరెసా, బాలినేని కాలనీల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం ఒంగోలు నగరంలోని ఆయా కాలనీలను సందర్శించారు. స్థానికులను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తక్షణమే తరలించాలని అధికారులను ఆదేశించారు. టంగుటూరులోని పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలోకి భారీగా నీరు చేరింది. తీర ప్రాంతంలోని నాలుగు మండలాల్లో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేయగా, కొత్తపట్నంలోని రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాగులుప్పలపాడు(48), సింగరాయకొండ(18), టంగుటూరు(35), కొత్తపట్నం(121)లోని కేంద్రాల్లో లోతట్టు కాలనీ వాసులకు పునరావాసం కల్పించారు.

▶ **యుద్ధప్రాతిపదికన పూడ్చివేత చర్యలు...:** నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలోని చెరువుకు గండి పడి ముంపునకు గురైన ఒంగోలు- చీరాల జాతీయ రహదారిని కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్.దామోదర్ పరిశీలించారు. గండి పడిన ప్రదేశాన్ని ఇసుక బస్తాలతో యుద్ధప్రాతిపదికన పూడ్చి రహదారి పైకి నీరు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జల వనరులు, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మండల అధికారులు ఉన్నారు. కంభం చెరువును జేసీ గోపాలకృష్ణ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

– న్యూస్‌టుడే, కంభం, సీఎస్‌పురం, తాళ్లూరు, ముండ్లమూరు, నాగులుప్పలపాడు, కనిగిరి

▶ **నేడు విద్యా సంస్థలకు సెలవు...:** భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు గురువారం కూడా సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు.



ఒంగోలు: వర్షంలోనే మదర్ థెరెసా కాలనీ వాసుల వెతలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ సుజాత

పెరుగుతున్న పంట నష్టాలు...

ఒంగోలు నగరం: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట నష్టాలు క్రమంగా పెరుగుతున్నాయి. చేతికందే దశలో ఉన్న సజ్జ, మినుము, అలసందలతో పాటు తాళ్లూరులో వరి, ఇతర ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఇరవై రోజుల క్రితం నాటిన మిర్చి నీట మునగడంతో మళ్లీ వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. తాళ్లూరు, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, ముండ్లమూరు మండలాల్లో ఇటీవల మిర్చి వేశారు. మళ్లీ నాట్లు వేయాలంటే ఎకరాకు రూ.30 వేలు వరకు ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శి సబ్ డివిజన్‌లో కండె దశలో ఉన్న మొక్కజొన్న నీరుపోసుకొని దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట	గ్రామాలు	మండలాలు	దెబ్బతిన్న విస్తీర్ణం(హె)	రైతులు
సజ్జ	30	08	310	285
మినుము	21	03	647	589
అలసంద	10	01	120	98

(వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం)



రాచర్ల: దద్దవాడ- కొత్తపల్లి గ్రామాల మధ్య కాలువకు ఏర్పడిన గండి



కనిగిరి: కలగట్ల వద్ద కందిలో వరద



పొదిలిలో నేలకూలిన చెట్టు



చదలవాడ చెరువు వద్ద రహదారి పైకి చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్



చదలవాడ వద్ద చెరువు కట్ట తెగి రహదారి పైకి చేరిన నీటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు, స్థానికులు



మారెళ్ల వద్ద చప్టా పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటితో ఒడ్డునే నిలిచిన గ్రామస్థులు



ఒంగోలు: నీరు చేరి చెరువును తలపిస్తున్న జల వనరుల శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం



ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో కాలువలా మారిన ఒంగోలు నగరంలోని కర్నూలు రహదారి

పెద్దారవీడులో బదిలీ పంచాయితీ

పెద్దారవీడు, న్యూస్‌టుడే: ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఒకే గ్రామానికి విధులకు రావడంతో గందరగోళం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఇటీవల కార్యదర్శులకు బదిలీలు చేశారు. ఇందులో భాగంగా ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను మండలంలోని పుచ్చకాయలపల్లి సచివాలయానికి కేటాయించారు. ఇద్దరూ విధుల్లో చేరేందుకు జిల్లా పంచాయతీ కార్యాలయంలోని అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో రామకోటమ్మ ఈ నెల 7న పుచ్చకాయలపల్లి సచివాలయంలో విధుల్లో చేరారు. మరుసటి రోజు పొన్నలూరు మండలం నుంచి బదిలీపై వచ్చిన మంత్రునాయక్ కూడా అదే గ్రామంలో కార్యదర్శిగా విధుల్లో చేరారు. అధికారుల బదిలీల వ్యవహారంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు ఇద్దరినీ విధుల్లో చేర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎంపీడీవో జాన్ సుందరంను 'న్యూస్‌టుడే' వివరణ కోరింది. దీనికి ఆయన మాట్లాడుతూ.. డీపీవో కార్యాలయంలో ఇద్దరికీ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారని, ఒకే పంచాయతీకి కేటాయించారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, ఇద్దరిలో ఒకరిని వేరొక పంచాయతీకి బదిలీ చేసే విషయంపై త్వరలో స్పష్టత వస్తుందని వివరించారు.

ఆ నల్లని రాళ్లలో.. ఎన్ని రూ.కోట్లు దోచెనో

- జిల్లా నుంచి ఆగని గ్రానైట్ అక్రమ రవాణా
- అయిదేళ్లలో జరిమానాలే రూ.206 కోట్లు



జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. ఎలాంటి అనుమతులూ లేకుండా కొందరు స్లాబులు తరలించేస్తున్నారు. రాయల్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ బాగోతం యథేచ్ఛగా సాగింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో కొద్దిరోజులపాటు ఆగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మళ్లీ మొదలైంది. అక్రమంలో పైచేయి కోసం ఒంగోలు, మార్కాపురం, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో ఇటీవల వివాదాలు తలెత్తాయి. ఈ ఉదంతాలు అధికార పార్టీ నేతలు పంచాయితీలు చేసే వరకు వెళ్లాయి. –ఈనాడు, ఒంగోలు



చీమకుర్తి నుంచి చెన్నై ఓడరేవుకు అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకున్న కంటెయినర్లు

▶ **నిఘా విభాగాన్ని నాడు నీరుగార్చి...:** చీమకుర్తిలో 45 వరకు క్వారీలు, 175 వరకు లీజులు ఉన్నాయి. వెలికితీసిన ముడిరాళ్లను తరలించేందుకు అనుమతులు అవసరం. అధికారికంగా జిల్లా నుంచి రోజుకు దాదాపు 300 వాహనాల ద్వారా 3,200 క్యూబిక్ మీటర్ల పరిమాణం గల గ్రానైట్ ముడిరాయిని తరలించేవారు. ఈ వాహనాలను గనులు, వాణిజ్య, రవాణా శాఖలు ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద తనిఖీ చేసేవారు. వైకాపా అధికారంలో ఉన్న గత అయిదేళ్లలో ఈ విధానానికి తూట్లు పొడిచారు. ఆ పార్టీ నేతల అండదండలతో రాళ్లను అక్రమంగా తరలించడాన్ని కొందరు వ్యాపారంగా మలచుకున్నారు. అధికారుల కళ్లుగప్పి.. వారికి ముడుపులు అందించి.. బెదిరింపులకు గురిచేసి తమ దందాను సాగించారు. కొన్ని క్వారీల నుంచి వెలికితీసిన రాళ్లలో 20 శాతం వరకు అక్రమంగా తరలించేవారు. వీటిపై తరచూ వెల్లువెత్తిన ఫిర్యాదులతో జిల్లా గనుల శాఖ ఆధ్వర్యంలో నిఘా విభాగాన్ని 2021 ఏర్పాటు చేసింది. అయినప్పటికీ అక్రమానికి అడ్డుకట్ట పడలేదు. అడపాదడపా దాడులు చేపట్టి కేసులు కట్టిన వాహనాల నుంచి వసూలు చేసిన జరిమానా సొమ్మే రూ.206 కోట్లుగా ఉంది. ఇక అధికారుల కళ్లు గప్పి తరలించిన రాళ్ల విలువ అంతకు రెండు మూడింతలు ఎక్కువ ఉంటుందని అంచనా. క్వారీల నుంచి వెలికితీసిన రాయిలో పెద్దవి కాకుండా నాణ్యత తక్కువ, చిన్న పరిమాణంలోనివి 20 శాతం వరకు మిగులుతాయి. వైకాపా హయాంలో వీటిని కొందరు గంపగుత్తగా దక్కించుకుని తరలించి సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఆ స్థానంలో కొత్తవారు వ్యాపారంలోకి రంగప్రవేశం చేశారు. వీరి మధ్య ఇప్పుడు తరచూ పంచాయితీలు సాగుతున్నాయి. అక్రమ రవాణాపై గనుల శాఖ డీడీ రాజశేఖర్ మాట్లాడుతూ.. అడ్డుకునేందుకు నిఘా విభాగం ఏర్పాటు చేశామని తెలిపారు. గత అయిదేళ్లలో తనిఖీలు చేపట్టి 2,283 గ్రానైట్ వాహనాలను పట్టుకుని, రూ.206 కోట్లు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా గ్రానైట్ స్లాబులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌడీ వేషాలేస్తే ఊరుకోం!

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు తమ పాత పద్ధతులను విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని, అందుకు భిన్నంగా దందాలు, బెదిరింపులు, భూముల కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఒంగోలు నగర పరిధిలోని రౌడీషీటర్లకు పట్టణంలోని తాలూకా పీఎస్‌లో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రౌడీలు తమ పంథా నుంచి తప్పుకొని ఏదో ఒక వృత్తిని ఎంచుకుని గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించాలని హితవు పలికారు. రౌడీ వేషాలు వేస్తే సమాజంలో విలువ ఉండదని, పిల్లల బంగారు భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. కౌన్సెలింగ్‌లో తాలూకా సీఐ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అదిరింపులు.. బెదిరింపులు

▶ అరకొరగా మద్యం దుకాణాల ఏర్పాటు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: 'మీరు నిర్వహించాలంటే మాతో చేతులు కలపాలి. ఒక్కడివే వ్యాపారం చేస్తానంటే కుదరదు. మాకూ వాటా ఇవ్వాల్సిందే..' అంటూ లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అనుచరులు పలుచోట్ల బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిణామం మద్యం దుకాణాలు ఏర్పాటుపై తొలిరోజు ప్రభావం చూపింది. జిల్లాలో మొత్తం 171 మద్యం దకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా. బుధవారం రాత్రికి ఒంగోలు డిపో పరిధిలో 40, మార్కాపురం డిపో పరిధిలో 50 దుకాణాలు మాత్రమే నెలకొల్పారు. ఒకటీ రెండుచోట్ల సరైన ప్రాంతాల్లో దుకాణాలు అద్దెకు దొరక్కపోవడంతో ఏర్పాటులో జాప్యం చోటుచేసుకుంది. మిగిలిన చోట్ల ప్రజాప్రతినిధుల అనుచరుల ఒత్తిళ్లతో జాప్యమవుతోందనే చర్చ సాగుతోంది.

మందులో మాయలోళ్లు



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో భారీ గోల్‌మాల్ చోటుచేసుకుంది. కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం గల్లంతైంది. ఎక్సైజ్ అధికారులు కొందరు, దుకాణాల సిబ్బందితో కలిసి రూ.కోట్లు దోచేశారు. నూతన మద్యం విధానం వచ్చేలోపు అంతా సర్దుబాటు చేద్దామని భావించారు. ఎక్కువ మొత్తం కావడంతో చేతులెత్తేయడంతో ఈ కుంభకోణం వెలుగుచూసింది. తమకే పాపం తెలియదని దుకాణాల సిబ్బంది పోలీసులను ఆశ్రయిస్తే., ఎక్సైజ్ అధికారి ఒకరు మాత్రం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఒంగోలులో వెలుగుచూసిన ఈ కుంభకోణం ఎక్సైజ్ శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. –న్యూస్‌టుడే, ఒంగోలు

▶ **జమ చేయకుండా చేతివాటం...:** వైకాపా హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించింది. ప్రైవేట్ సంస్థ ద్వారా ప్రతి దుకాణానికి సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌ను నియమించి విక్రయాలు సాగించింది. నాలుగైదు దుకాణాలకు ఒక ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌ను పర్యవేక్షకుడిగా నియమించింది. రోజువారీ మద్యం అమ్మకాలను పర్యవేక్షించి, సంబంధిత సొత్తును బ్యాంకు ఖాతాలో జమ చేయడం వీరి విధి. ఇక్కడే కొందరు ఎక్సైజ్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. సిబ్బందిని తమ గుప్పిట్లో పెట్టుకుని ఆర్థిక అరాచకాలకు పాల్పడ్డారు. ఒక్క ఒంగోలు నగరంలోనే పద్నాలుగు దుకాణాల్లో ఏకంగా రూ. అయిదు కోట్లకు పైగా గోల్‌మాల్ అయినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.

▶ **అమ్మనట్లు చూపుతూ పక్కదారి...:** నిబంధనల ప్రకారం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అన్ని లావాదేవీలను రికార్డు చేయాలి. విక్రయించిన ప్రతి సీసాపై ఉండే బార్‌కోడ్‌ను స్కాన్ చేయాలి. కొన్నిచోట్ల మాత్రం విక్రయించిన మద్యం సీసాల బార్‌కోడ్‌ను స్కాన్ చేయలేదు. అవి దుకాణంలోనే నిల్వ ఉన్నట్లు అందరి కళ్లకూ గంతలు కట్టారు. తక్కువ మొత్తం విక్రయించినట్లు చూపుతూ అంతే స్థాయిలో విక్రయాల సొత్తును పక్కదారి పట్టించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఒక హెడ్ కానిస్టేబుల్ కీలక పాత్ర పోషించారనీ, ఆయనకు తాము ఫోన్ పే, గూగుల్ పే వంటి ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ. లక్షలు చెల్లించామని దుకాణ సిబ్బంది చెబుతున్నారు. ఆఫ్‌లైన్‌లో నగదు రూపేణా కూడా తమ వద్ద నుంచి లక్షల రూపాయాలు తీసుకెళ్లాడనీ, త్వరలో సర్దుబాటు చేస్తానని చెప్పి చివరకు చేతులెత్తేశాడంటున్నారు.

▶ **సిబ్బందిదీ దొంగ బుద్ధే...:** స్వాహాలో సదరు హెడ్ కానిస్టేబుల్ మాత్రమే కాదు, మాల్స్‌లో పనిచేసే సిబ్బంది పాత్ర కూడా ఉందని తెలుస్తోంది. సదరు హెడ్ కానిస్టేబుల్ తనకు తెలిసిన వారి పేరిట రెండు మాల్స్ నుంచి రూ.50 లక్షల వరకు బదలాయించుకున్నారని, మిగతా మొత్తం నగదు రూపంలో తీసుకెళ్లారని సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై వారు ఇన్నాళ్లూ ఎందుకు నోరు మెదపలేదనే ప్రశ్న తలెత్తుతోంది. తెలిసి కూడా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో దుకాణాల్లో పనిచేసే సిబ్బంది పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్పీ ఆదేశాలతో విచారణ...

ప్రధానంగా ఒంగోలులోని రెండు వాక్ ఇన్ స్టోర్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. మంగమ్మ కళాశాల ఎదురుగా ఉన్న స్టోర్‌లో రూ.1.70 కోట్లు, మంగమూరు రోడ్డు కూడలికి సమీపంలో ఉన్న స్టోర్‌లో రూ.95 లక్షల వరకు ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. సదరు స్టోర్లపై పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్న అధికారి తమ వద్ద నుంచి పలు దఫాలుగా లక్షలాది రూపాయలు వసూలు చేశారంటూ వాటిలో పనిచేస్తున్న సిబ్బంది జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన విచారణకు ఒంగోలు పోలీసులను ఆదేశించారు. దీంతో ఒంగోలు తాలూకా పోలీసులు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌తో పాటు దుకాణాల సిబ్బందిని పిలిపించి విచారించారు. తొలుత విచారణకు హాజరైన సదరు హెడ్ కానిస్టేబుల్ ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఖాజా మొహియుద్దీన్ మాట్లాడుతూ.. ఒంగోలులోని లిక్కర్ మాల్స్‌లో నిధుల గోల్‌మాల్ వాస్తవమేనన్నారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నామనీ, పూర్తిస్థాయిలో నిజాలు రాబట్టిన తర్వాత సమాచారం ఇస్తామని తెలిపారు.



అంధకారంలో ఆసుపత్రి

మార్కాపురం సర్వజన వైద్యశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోగులు అల్లాడారు. వర్షాల కారణంగా వైద్యశాలలో అంతర్గతంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగల్లో సమస్య తలెత్తి సరఫరా నిలిచిపోవడం ఇందుకు కారణం. విద్యుత్తు సరఫరా లేకపోవడం.. ఆకాశం మేఘావృతమై ఉండటంతో చీకటిలోనే రోగులు, బంధువులు ఉండిపోవాల్సి వచ్చింది.

– న్యూస్‌టుడే, మార్కాపురం వివరాలు(8లో)





నలుగురిని పొట్టన పెట్టుకున్న దోర్నపువాగు ఇదే



ముండ్లమూరు మండలంలోని ఈదరవాగు ఉద్ధృతి

వాగుల గండం...!

- ❖ వానొస్తే గ్రామాలకు తెగిపోతున్న సంబంధాలు
- ❖ పట్టించుకోని గత పాలకులు
- ❖ వారధులు నిర్మించక అవస్థలు

ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే బృందం:

వాగుల గండం జిల్లావాసులను వెంటాడుతోంది. చిరు జల్లు పడినా ఇవి విరుచుకుపడుతుండటంతో రాకపోకలు రెండు, మూడు రోజుల పాటు నిలిచిపోతున్నాయి. కళ్లముందే పంటపొలాలు మునిగి..మూగజీవాలు వాగుల్లో కొట్టుకుపోయి గ్రామస్థులు బిక్కుబిక్కుమంటున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు పొంగుతున్నాయి. వారధులు నిర్మిస్తేనే దీనికో పరిష్కారం లభిస్తుంది.

ప్రాణాలు తీస్తున్న ..

తాళ్లూరు-ముండ్లమూరు ర.భ.మార్గంలో విఠలాపురం వద్ద ఉన్న దోర్నపు వాగు పొంగిన వేళ ఆ మార్గంలో వెళ్లాలంటే గుండెజారిపోతోంది. కొన్నేళ్ల క్రితం ఇక్కడ నీటి ఉద్ధృతికి లారీ బోల్తాపడి ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు పశువుల కాపరులు వాగులో కొట్టుకుపోయి చనిపోయారు. రెండు రోజులుగా ఇది పొంగి ప్రవహిస్తుండటంతో స్థానికులు భీతిల్లుతున్నారు.

దాటాలంటే బిక్కుబిక్కు..

కంభం మండలంలోని ఎర్రబాలెం వద్ద ఉన్న గుండ్లకమ్మ వాగు పొంగితే అక్కడి నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాళ్లూరు మండలంలోని రజానగరం వాగుకు వరద పోటెత్తితే తాళ్లూరు - అద్దంకి మండలాల మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి. ముండ్లమూరు మండలంలోని మారెళ్ల-జమ్ములమడక గ్రామాల మధ్య ఉన్న ఈదరవాగు; పొదిలి - మార్కాపురం మార్గంలోని బట్టువారిపల్లి వాగు వద్ద ముప్పు పొంచివుంది. అక్కడ వంతెనలు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడంలేదు. ఒంగోలు-కర్నూలు ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఊరచెరువు నీరు ముంచెత్తడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వైకాపా పట్టించుకోక..చంద్రన్న చెంతకు..

నాగులుప్పలపాడు నుంచి గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వరకు 12 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారిలో కొత్తకోట, హనుమాపురం, నిడమానూరు వాగులున్నాయి. వర్షాలు పడితే ఇవి పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. స్థానికులు తమ గోడు వైకాపా పాలకులకు విన్పించినా వారు పట్టించుకోలేదు. దీంతో ఇటీవల మద్దిరాలపాడుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వాటిపై వారధులు కట్టాలని విన్నవించారు.



పొంగి పొర్లుతున్న కొత్తకోట వాగు

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులో పర్యటించారు. చాలా ప్రాంతాల్లో వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

ఇంటి వెలుగులకు ఎన్ని కష్టాలో...



వేటపాలెం : వేటపాలెంలో విద్యార్థినులు సరస్వతీ నిలయానికి వెళ్లడం ఓ సాహసంలా మారింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డంతా బురదమయంగా మారింది. ఈ మార్గంలోనే కస్తూర్బాగాంధీ పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహం ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో నిత్యం దాదాపు 1000 మంది రాకపోకలు సాగిస్తుంటారు. బురదలో అడుగేస్తే సర్రున జారిపడే ప్రమాదముండటంతో విద్యార్థినులను పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు.

పైకప్పుతో సరి.. అవస్థలే మరి



పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆడిటోరియం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఒంగోలు ఎంపీ నిధులు రూ.17.50 లక్షలతో స్టేజీ ముందుభాగంలో ఇనుప దిమ్మెలతో వలయాకారంలో నిర్మించి కింద కాంక్రీటు గచ్చు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నిధులు లేవంటూ పైకప్పు ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. దీనికి నిధులు మంజూరుచేస్తే వివిధ సమావేశాలు..విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపకరిస్తుంది.

మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఎన్‌సీఈఆర్‌టీలో డిప్యుటేషన్‌పై పనిచేసే పోస్టులకు అర్హత గల మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో కోరారు. అర్హులైన పోస్టుల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. వాటికి ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల పరిధిలోని టీచర్లు అర్హులని చెప్పడం సరికాదన్నారు.

కొండ చిలువ పట్టివేత

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మేడపిలో బుధవారం రాత్రి కొండ చిలువ కలకలం రేపింది. నల్లూరి వెంకట్రావు వాటర్ ప్లాంటు వద్ద ఉన్న తొట్టిలో 15 అడుగుల కొండ చిలువ కనిపించింది. దీంతో సమాచారం అందుకున్న అటవీ శాఖ రెస్క్యూవర్ మల్లికార్జున్ వచ్చి దాన్ని పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు.

డ్వాక్రా నిధుల గోల్‌మాల్‌పై విచారణ

జరుగుమల్లి, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల మహిళలు చెల్లించాల్సిన రుణాల నగదును సిబ్బంది స్వాహా చేసిన ఉదంతంపై అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం కొండపి ప్రాంత సమన్వయకర్త కత్తి కల్యాణ్ వెలుగు మహిళలతో దీనిపై మాట్లాడారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని అయిదు గ్రూపులకు సంబంధించిన మహిళలు గతంలో రూ.20 లక్షల వరకు నగదు రుణాలు తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రతి నెల స్థానిక కెనరా బ్యాంకుకు నగదును విడతల వారీగా చెల్లిస్తున్నారు. స్థానికంగా వీవోఏగా విధులు నిర్వహిస్తున్న జ్యోతికి మహిళా సంఘాల సభ్యులు రుణాల నగదును అందించేవారన్నారు. అయితే ఆమె నగదును బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు బాధితులు తెలిపినట్లు ఆయన చెప్పారు.

పోలీసులకు ఫిర్యాదుతో..

రుణాల నగదు స్వాహా తతంగం అయిదు నెలలుగా సాగుతుండటం, రుణాలు చెల్లించిన నగదుకు సంబంధించిన రసీదులు ఇవ్వకపోవడంతో అనుమానమొచ్చి బాధిత మహిళలు మంగళవారం వీవోఏను నిలదీశారు. బాధ్యురాలిపై చర్యలు తీసుకోవాలని గ్రూపులోని యాభై మంది సభ్యులు మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీంతో విషయం తెలుసుకున్న శాఖ అధికారులు కొండపి ఏరియా కోఆర్డినేటర్ కల్యాణ్, లీగల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం జయరాజు, సీసీలను విచారణ నిమిత్తం జరుగుమల్లికి పంపించారు. దీనిపై వీవోఏ జ్యోతిని గ్రూపు సభ్యుల ముందు విచారించగా వాస్తవమేనని అంగీకరించారు. సుమారు రూ.6 లక్షల నగదు సొంత అవసరాలకు వినియోగించినట్లు ఆమె చెప్పారు. డిసెంబర్ నాటికి పూర్తిగా చెల్లించేందుకు అంగీకరించినట్లు విచారణాధికారులు తెలిపారు. ఈ మేరకు బాధితులు తెలిపిన వివరాలు, ఇతర అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణ అధికారులు తెలిపారు. వెలుగు మహిళలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



విచారణకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న మహిళా సంఘాల గ్రూపు సభ్యులు

అర్ధరాత్రి వేళ సులభ్ కాంప్లెక్స్ నేలమట్టం

❖ ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పెద్దబస్టాండ్ సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ గదులను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. గతేడాది జూన్‌లో అక్కడ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్న అంజమ్మ అనే మహిళను బెదిరించి పాక్షికంగా ధ్వంసం చేశారు. తాజాగా బుధవారం రాత్రి కూల్చివేశారు. అప్పట్లో పొదిలి పోలీసుస్టేషన్‌లో నగర పంచాయతీ కమిషనరు, నిర్వాహకులు సుభానీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుత నగర పంచాయతీ కమిషనరు పి.శ్రీనివాసరావు సూచనతో నిర్వాహకుడు పునరుద్ధరించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ కాంప్లెక్స్ పక్కనే స్థలం ఉన్న వ్యక్తులే కూల్చివేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై పొదిలి నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాసరావును వివరణ కోరగా సులభ్ కాంప్లెక్స్ స్థలం వెనుక వైపున ఉన్నవారు గతంలో రెండుసార్లు ధ్వంసం చేశారని, ఇప్పుడు మరోసారి కూల్చివేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడతామన్నారు.



కూల్చివేసిన సులభ్ కాంప్లెక్స్

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 505 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 157, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 259



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా నాయకులు

వెలిగొండకు నిధులు కేటాయించరూ!

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా సీపీఐ నాయకులు బుధవారం విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయంలో ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని 36 మండలాలకు తాగు, సాగునీటి సమస్య తీరనున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 11 ముంపు గ్రామాల నుంచి 7,500 మంది నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కింద నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లు అవసరమన్నారు. ఈ మేరకు ప్రాజెక్ట్‌ను త్వరలోనే సందర్శించి, పనుల పూర్తికి నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, నాయకులు కె.వెంకటరావు, కె.వీరారెడ్డి తదితరులు రాష్ట్ర మంత్రిని కలిశారు.

విధులు నిర్వహిస్తూ.. కుప్పకూలి..

దర్శి, న్యూస్‌టుడే: విధులు నిర్వహిస్తూ ఓ ఉద్యోగి కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు దర్శి ఆర్‌డబ్ల్యూఎస్‌లో హెచ్‌ఆర్ ఉద్యోగిగా కాలూరి గురవయ్య (45) పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం ఆయన స్థానిక పంప్‌హౌస్ వద్ద విధులు నిర్వర్తిస్తూ పడిపోయారు. ఇతర సిబ్బంది వచ్చి ఆయన్ను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.



మృతి చెందిన గురవయ్య (పాతచిత్రం)

విద్యుత్తు స్తంభమెక్కి..

మద్దిపాడు,న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలచనకోట ఎస్సీ కాలనీకి చెందిన గుంటూరు మోషే ఇంటికి మూడు రోజులుగా విద్యుత్తు సరఫరా కావడం లేదు. దీంతో స్థానికంగా ఉన్న కొలచనకోట సాయి (30)ని మరమ్మతులు చేయమని కోరారు. ఈ మేరకు సాయి సంబంధిత శాఖాధికారులకు తెలియకుండానే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. నిచ్చెన సాయంతో కరెంట్ స్తంభం ఎక్కగా విద్యుదాఘాతానికి గురై పడిపోయి మృతిచెందారు. మృతునికి భార్య, పది సంవత్సరాల పాప ఉన్నారు.

కూలిన మిద్దె పైకప్పు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే:: మండలంలోని గొల్లపల్లిలో వర్షాలకు ఓ మట్టి మిద్దె పైకప్పు కూలిపోయింది. సానె వెంకటేశ్వర్లు నివాసముంటున్న పాత మట్టి మిద్దె బుధవారం పడిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని సామగ్రి దెబ్బతిందని బాధితులు వాపోయారు.

వర్షం నీరు నిలవకుండా పూడికతీత: కలెక్టర్

ఒంగోలు గ్రామీణం: భారీ వర్షాల నేపథ్యంలో నీరు నిలబడకుండా తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలు మండలం వెంగముక్కపాలెం రోడ్డులోని మదర్‌థెరెసా, బాలినేని కాలనీలను బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. పక్కనే ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగును పరిశీలించి ఆ ప్రాంత వాసులతో మాట్లాడారు. ఒంగోలు నగరంలోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిల్వకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాను రెడ్ జోన్‌గా ప్రకటించిన నేపథ్యంలో యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నీరు ప్రవహిస్తున్న చప్టాల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కూడా నియమించినట్లు వివరించారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. అనంతరం కొప్పోలు-కరవది గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ముదిగొండ వాగు చప్టాను పరిశీలించారు. వరద తీవ్రత తగ్గే వరకు ఎవర్నీ వెళ్లనివ్వొద్దని అధికారులను ఆదేశించారు.



మదర్ థెరెసా కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

9 గంటలు చీకట్లోనే!

❖ మార్కాపురం వైద్యశాలకు నిలిచిన విద్యుత్తు సరఫరా ❖ పనిచేయని జనరేటర్

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం సర్వజన వైద్యశాలకు దాదాపు తొమ్మిది గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో రోగులు హైరానా పడ్డారు. వైద్యశాలలో అంతర్గతంగా ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగలు జామ్ అయి తెగిపోవడంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. వర్షాల కారణంగా కారుమబ్బులు కమ్ముకోవడంతో చిమ్మచీకట్లు అలముకుని రోగులు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల తర్వాత జనరేటర్‌ను ఆన్ చేశారు. అయితే వర్షాల కారణంగా విద్యుత్తు తీగలు జామ్ అవ్వడంతో ఫలితం లేకపోయింది. దీంతో వైద్య సిబ్బంది విద్యుత్తు అధికారులకు సమాచారమివ్వగా ఏడీఈ సీయానాయక్ సిబ్బందిని పంపించారు. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించి ఎట్టకేలకు తీగలను సరిచేయడంతో సాయంత్రం 5 గంటలకు సరఫరా మొదలైంది. ఈ కారణంగా శస్త్ర చికిత్సలను కొన్ని గంటల పాటు నిలిపివేశారు. చరవాణి వెలుగుల్లో వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తించారు. దీనిపై వైద్యశాల పర్యవేక్షణాధికారి డాక్టర్ సావిత్రిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వర్షాల కారణంగా భూమి లోపల ఉన్న విద్యుత్తు తీగలు దెబ్బతిన్నాయని, అయినా శస్త్ర చికిత్సలు కొనసాగించామని చెప్పారు. ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్ వైద్యశాలను సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు.



మార్కాపురం సర్వజన వైద్యశాల



చీకట్లో ఓపీ చూస్తూ..

రహదారిపై నిలిచిన నీరు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు - కర్నూల్ రహదారిలో యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద నిలిచిపోయిన నీటిని అధికారులు యుద్ధప్రాతిపదికన తోడించారు. వాగు కాదు.. కర్నూల్ రాచబాటే శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు రెవెన్యూ, మండల పరిషత్తు అధికారులు స్పందించారు. నాలుగు భారీ మోటార్లను ఏర్పాటు చేసి రహదారి, పక్కనున్న లోతట్టు ప్రాంతంలో నిలిచిన నీటిని బయటకు తొలగించారు. అనంతరం కంకర మిక్చర్ తోలించి జేసీబీ సాయంతో గుంతలను పూడ్చించారు. రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులకు ఊరట లభించింది. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర, సర్పంచి మరియమ్మ, వీఆర్వో రామారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, యాకోబు, తదితరులు పనులను పర్యవేక్షించారు.



నీటిని మోటార్ల సాయంతో తోడుతున్న దృశ్యం

ఇంటికి వస్తున్నానని చెప్పి..శవమై తేలి..

దర్శి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ ఉద్యోగి మృతిచెందారు. ఈ సంఘటన లంకోజనపల్లిరోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..దర్శి మండలం కొత్తవెంకటాపురానికి చెందిన జింకల హరిశ్చంద్రారెడ్డి (34) ఎంబీఏ పూర్తిచేసి పొదిలిలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నారు. ప్రతిరోజూ పొదిలి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం దర్శి మండలం రాజంపల్లికి కంపెనీ పనిమీద వెళ్లారు. సాయంత్రం పిల్లలకు అల్పాహారం తీసుకొస్తున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పారు. అయితే అర్ధరాత్రి అయినా తిరిగి రాలేదు, ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె విషయం బంధువులకు చెప్పారు. వారు వెతుకుతుండగా సాగర్ కాలువ గట్టుపై మృతుని ద్విచక్ర వాహనం, ఇంటికి తెస్తున్న వస్తువులు, చరవాణి కనిపించాయి. దీంతో సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. బుధవారం ఉదయం పొదిలి రోడ్డుకు సమీపంలో కాలువలో ఆయన మృతదేహం లభ్యమైంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారా..లేక ప్రమాదవశాత్తూ పడిపోయి మృతిచెందారా అన్న విషయాలు దర్యాప్తులో తేలుతాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.



జింకల హరిశ్చంద్రారెడ్డి (పాతచిత్రం)

వివాహిత ఆత్మహత్యా యత్నం

మార్కాపురం, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. మార్కాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండారెడ్డికాలనీలో నివాసముంటున్న దద్దనాల మల్లికార్జున-జ్యోతి దంపతులు. వీరికి నాలుగేళ్ల క్రితం వివాహంకాగా, ఇద్దరు పిల్లలున్నారు. మల్లికార్జున స్థానికంగా ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంతకాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేధిస్తున్నాడు. దీంతో వారి మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురైన జ్యోతి బుధవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించగా ఆమెను మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన దీక్ష


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ యూనియన్ కార్మికులు

మార్కాపురం పట్టణం: మున్సిపాలిటీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్-సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారణం లేకుండా మున్సిపాలిటీ పనిచేస్తున్న 20 మంది ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులను దారుణమన్నారు.

మార్కాపురం
● మార్కాపురం ● గిద్దలూరు ● యర్రగొండపాలెం

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

గిద్దలూరు పట్టణం: డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత కోచింగ్‌తో పాటు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఎస్‌డబ్ల్యూవో అమ్మాజీ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ వెబ్‌సైట్‌లో ఈనెల 21వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు శిక్షణ అందస్తామని పేర్కొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం 25 శాతం రాయితీతో శనగ విత్తనాలు అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్‌నాయక్ తెలిపారు. మండలానికి 50 క్వింటాళ్లు మంజూరయ్యాయని కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.


గిద్దలూరు : వివేకానందకాలనీలో ఓ ఇంటి యజమానురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


కంభం చెరువును పరిశీలించి తహసీల్దార్ కిరణ్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ

పొంచి ఉన్న ముప్పు.. అప్రమత్తత అవసరం

గిద్దలూరు పట్టణం, కంభం, కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే : తుపాను హెచ్చరికల నేపథ్యంలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు నగర పంచాయతీలోని సగిలేరును పరిశీలించారు. వివేకానందకాలనీలో వర్షపు నీరు ఓ ఇంటి ప్రాంగణంలోకి చేరడంతో ఆ ఇంటిని అధికారులతో కలిసి పరిశీలించారు. ● చారిత్రక కంభం చెరువును సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ బుధవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తటాకాన్ని చూశారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు, నీటి సరఫరా తదితర విషయాలను తహసీల్దార్ కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో వర్షాల ప్రభావం తదితర విషయాలపై ఆరా తీశారు. ● అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రాచర్ల మండలం నెమలిగుండం వద్ద గుండ్లకమ్మ వాగు ఉద్ధృతిని తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. చోళవీడు సమీపంలోని వాగును చూశారు. వరద వచ్చే అవకాశం ఉండడంతో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తెలియజేశారు. ● కొమరోలు మండలంలోనిఅలసనపల్లె-సూరావారిపల్లె మార్గంలో ప్రవహిస్తున్న పులివాగును సంయుక్త కలెక్టర్ జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.


పెద్దదోర్నాల అయినముక్కల బీసీ కాలనీలో కాలువను తలపిస్తున్న అంతర్గత రహదారి


కంభం : తురిమెళ్ల అటవీ శాఖ కార్యాలయం ముందు ఇలా..

చినుకు పడితే.. చిత్తడే

యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, కంభం న్యూస్‌టుడే : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. రహదారులపై అడుగు తీసి అడుగు వేయాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రహదారులు అధ్వానంగా మారిపోయాయి. వీధులు జలయ్యాయి. మార్కాపురం, యర్రగొండపాలెం పట్టణాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ పరిధిలోని పెద్దదోర్నాల ఇందిరానగర్, అయినముక్కల బీసీ కాలనీ, తిమ్మాపురం ఎస్సీ కాలనీలు బురదమయంగా మారాయి. మురుగుకాలువలు పొంగాయి.


యర్రగొండపాలెం : వస్తాద్ బజారులో మోకాలి లోతు నిలిచిన నీరు

భారీ వర్షంతో అన్నదాత విలవిల

● ఎడతెరిపి లేకుండా వానలు ● దెబ్బతిన్న పంటలు ● ఆవేదనలో రైతులు


కంభం : తురిమెళ్ల - యర్రబాలెం గ్రామాల నడుమ పత్తి పొలంలో నిలిచిన వర్షం నీరు

మార్కాపురం, కంభం, కంభం(రాచర్ల), న్యూస్‌టుడే: దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ప్రకాశం జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. మార్కాపురం పశ్చిమ ప్రకాశం లోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు మూడు నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రైతులు వేసిన వరి, పత్తి, మిరప, పొగాకు, కంది, జొన్న, మొక్కజొన్న, ఉద్యానవన పంటలైన దోస, బెండ, దొండ, బొప్పాయి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల పంటలన్నీ తెరతెగిలి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలు 45318 ఎకరాలు సాగు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పత్తికి తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పత్తి కాయ పగిలితే మరింత దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. పత్తిలో కాయ కుళ్లు రాకుండా రైతులు నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉద్యానవన పంటలు కూడా ఇలానే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిస్తే దోస, బెండ, దొండ, కాకర, టమాటా, క్యాప్సికం, గోంగూర, తోటకూర, పాలకూర పంటల సాగు నష్టపోతాయని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు దేవిరెడ్డి శ్రీనివాసులు, రమేష్‌బాబు, వ్యవసాయ సహాయకులు మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు, మాల్యవంతునిపాడు గ్రామాల్లో వర్షానికి నీటమునిగిన పంటలను పరిశీలించారు. ● కంభం మండలంలోని యర్రబాలెం- తురిమెళ్ల గ్రామాల నడుమ ఉన్న పత్తి పొలాల్లో జలం నిలిచి ఉంది. మదారుపల్లి, నర్సిరెడ్డిపల్లి తదితర గ్రామాలోని పొలాల్లోకి నీరు చేరింది. ● రాచర్ల మండలంలోని గుడిమెట్ట, కొత్తపల్లి, రాచర్ల, అనుమలవీడు, చోళవీడు తదితర గ్రామాల్లోని మిరప, పత్తి, పొగాకు తదితర పైర్లలోకి నీరు చేరింది. ఆకవీడు గ్రామంలో గాలులు, వర్షానికి సుమారు 1100 అరటి చెట్లు పడిపోయాయి.


రాచర్ల : ఆకవీడు పడిపోయిన అరటి చెట్లను చూపుతున్న రైతు చిన్నఈశ్వరయ్య


మార్కాపురం: బోడపాడులో దోస పంట దుస్థితి..


రాచర్ల : మిరప పొలంలో నిలిచిన వర్షం నీరు

కూలిన పెంకుటిల్లు


గోగులదిన్నెలో వర్షానికి కూలిన అంబడిపూడి పిచ్చమ్మ ఇల్లు

మార్కాపురం : మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోగులదిన్నె గ్రామంలోని అంబడిపూడి పిచ్చమ్మ అనే వృద్ధురాలి పెంకుటిల్లు వర్షానికి నానిపోయి కూలింది. గోడలు పలకరాళ్లతో నిర్మాణం చేసింది కావడంతో పాటు పెంకులు ఎప్పటివో కావడంతో వర్షానికి పూర్తిగా నానిపోయి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లోనే వృద్ధురాలు పిచ్చిమ్మ ఉండటంతో శబద్దం రావడంతో వెంటనే బయటకు వచ్చింది. దీంతో పెంకులు ఆమెపై పడటంతో స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రభుత్వం వృద్ధురాలికి జరిగిన నష్టానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధితురాలు కోరుతుంది

నేలకొరిగిన చెట్లు

పొదిలి, బేస్తవారపేట, కొమరోలు గ్రామీణం : పొదిలి మండలంలో మూడు రోజులుగా కురుస్తున్నవర్షాలకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. పట్టణంలోని జహంగీర్‌బాషావీధిలో ఉన్న ఓ మోస్తారు చెట్టు వేర్లతో సహా నేలకొరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారిపై నీరునిల్వకుండా కమిషనరు పి. శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.మారుతీరావు చర్యలు తీసుకున్నారు. ఇరువైపులా నీరుపోయేందుకు కాలువల్లో పూడిక తీయించారు. అయినప్పటికీ కొన్నిచోట్ల దుకాణదారులకు అసౌకర్యం కలిగింది. ◗ బేస్తవారపేట పంచాయతీలోని పాపాయిపల్లెలో స్థానిక పీర్ల చావిడి వద్ద ఉన్న చెట్టు పక్కనే ఉన్న ఇంటిపై విరిగి పడిపోయింది. తహసీల్దార్ జితేంద్రకుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని విద్యుత్తు సరఫరా నిలిపివేయించి కూలీలతో ఇంటిపై విరిగిపడిన చెట్టును తొలగించారు.


బేస్తవారపేట : ఇంటిపై విరిగిపడిన చెట్టును కూలీలతో తొలగిస్తున్న తహసీల్దార్ జితేంద్రకుమార్

రాకపోకలకు అంతరాయం: కొమరోలు మండలంలోని గుంతపల్లె-మొట్టు పల్లె మార్గంలో భారీవర్షాలకు రహదారిపై వర్షపు నీరు పారడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పులివాగు సమీపంలో రాకపోకలు నియంత్రణకు స్థానిక సర్పంచి ముత్తుముల రామకృష్ణా రెడ్డి, వీఆర్వో, పోలీసుల సహకారంతో రాకపోకలను నియంత్రణకు బందోబస్తు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
పొదిలి : 8008550360
కంభం : 8008632343

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే



సమస్య : రామాయణకండ్రికలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందిగా ఉంది. చర్యలు తీసుకోండి.
– రామారావు, రామాయణకండ్రిక

సమాధానం : సిబ్బందిని పంపి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను. – భూపాల్‌రెడ్డి, నగరపంచాయతీ ఏఈ పొదిలి

మెరుగైన సేవలు అందించండి

మార్కాపురం : మార్కాపురంలోని సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు తక్షణమే వైద్యం అందించాలని మార్కాపురం ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మార్కాపురం సర్వజన వైద్యశాలను ఉప కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులను, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత అత్యవసరం అయితే తప్ప ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయాలన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. వైద్యశాల అధికారులు, వైద్యులకు పలు సూచనలు చేశారు.

బంకుల తొలగింపు : గిద్దలూరు పట్టణం, : గిద్దలూరు నగర పంచాయతీలోని తహసీల్దారు కార్యాలయం ముందు ఉన్న బంకులను తొలగించేందుకు ఇటీవల అధికారులు నోటీసులు అందజేశారు. ఆక్రమణ దారులు బంకులు తొలగించకపోవడంతో నగర పంచాయతీ పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉన్న బంకులను పోలీసులు ఆధ్వర్యంలో తొలగించే ప్రయత్నం చేశారు. గురువారం తొలగించకపోతే తామే తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందాలి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు నియోజకవర్గం నుంచి కడప జిల్లాకు వెళుతున్న వెలిగొండ కాలువల ద్వారా మన ప్రాంతంలోని ప్రతి ఎకరాకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించేలా చూద్దామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి బుధవారం వెలుగొండ ప్రాజెక్టు అధికారులకు సూచించారు. ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.నాగజ్యోతి, ఇంజనీర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులతో పశ్చిమకాలువ మ్యాప్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వెలిగొండ ప్రాజెక్టు ఏఈ షోడా నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తురిమెళ్ల అటవీక్షేత్రాధికారి మధు ప్రియాంక తమ సిబ్బందితో కలసి రేంజ్‌లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్లారు.


వెలుగొండప్రాజెక్టు అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


రాచర్ల : మిరప పంటను పరిశీలిస్తున్న గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారిణి విష్ణుప్రియ


కోలభీమునిపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నీరు నిలిస్తే నష్టమే

యర్రగొండపాలెం పట్టణం, తర్లుపాడు, బేస్తవారపేట, కంభం, కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం మండలంలోని తమ్మడపల్లె, గుర్రపుశాల గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పత్తి, మిర్చి, కంది పంటలను వ్యవసాయాధికారి శేషిరెడ్డితో కలిసి పరిశీలించారు. నీరు నిలిస్తే పత్తి దెబ్బతినే పరిస్థితి రావచ్చునని పేర్కొన్నారు. ● తర్లుపాడు మండలంలోని నాగెళ్లముడుపు, జగన్నాథపురంలో ఏవో వెంకటేశ్వర్లు కంది, మిరప, పత్తి, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.● బేస్తవారపేట మండంలోని జే.సి అగ్రహారం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో కంది, పత్తి తదితర పంటలను ఏవో జక్కం మెర్సీ పరిశీలించారు. ●కంభం మండలంలోని మదార్‌పల్లి, నర్సిరెడ్డిపల్లి గ్రామాల్లో సాగులో ఉన్న ఉద్యాన పంటలను ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత, వ్యవసాయాధికారి స్వరూప బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పొలాల్లో నిలిచిన నీటి బయటకు పంపించాలని చెప్పారు. రైతులకు పలు సూచనలు చేశారు. ● రాచర్ల మండలం జేపీ చెరువు, చోళవీడు, చిన్నగానిపల్లి, అన్నంపల్లి గ్రామాల్లోని మిరప పంటలను గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారిణి విష్ణుప్రియ పరిశీలించారు.

కూటమి ప్రభుత్వంతో గ్రామాలకు మంచి రోజులు

తర్లుపాడు, యర్రగొండపాలెం పట్టణం, కంభం (రాచర్ల) : కూటమి ప్రభుత్వం రాకతో గ్రామాలకు మంచి రోజులు వచ్చాయంటూ మార్కాపురం శాసన సభ్యుడు కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. తర్లుపాడు మండలంలోని బుడ్డపల్లె గ్రామంలో బుధవారం చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అయిదేళ్లలో గ్రామాలు అభివృద్ధికి నోచులేదని పేర్కొన్నారు. గ్రామాల్లోని రహదారులను, డ్రైనేజ్ కాలువలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.● తెదేపా ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం యర్రగొండపాలెం పట్టణంలో వేగినాటి కోటయ్య బజారులో పల్లెపండుగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణంలో రూ. 1.40 కోట్లతో నిర్మించే నాలుగు సీసీ రోడ్లు నిర్మాణం పనులకు ఆయన పూజలు చేసి శంకుస్థాపన చేశారు. ● రాచర్ల మండలం సోమిదేవిపల్లి పంచాయతీలో ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి సిమెంట్ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు.


యర్రగొండపాలెం : సీసీ రోడ్డు శంకుస్థాపన పూజలో తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు


తర్లుపాడు: బుడ్డపల్లెలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ఏర్పాటు కాని మద్యం దుకాణాలు


మద్యం గోదాంలో నిల్వ ఉన్న మద్యం పెట్టెలు

మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పాత మద్యం విధానాన్ని పూర్తిగా తొలగించి కొత్త మద్యం పాలసీని అమలులోకి తీసుకొచ్చింది. పూర్తిగా ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి మద్యం దుకాణాలను ప్రైవేటు పరం చేసింది. గత రెండు రోజుల కిందట లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి మద్యం దుకాణాలు కేటాయిస్తూ అధికారులు నియామకాలు అందజేశారు. నియామక పత్రాలతో పాటు ప్రతి దుకాణదారుడికి లాగిన్‌తో పాటు పార్వర్డ్ అందజేశారు. అందరూ ఎవరి లాగిన్‌లో వారే మద్యంను వారికి కావాల్సినంత కొనుగోలు చేసి ఆన్‌లైన్‌లోనే డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఈ విధానంలో దుకాణాలు దక్కించుకున్న వారు ఆన్‌లైన్‌లో మద్యం కొనుగోలు చేసి ప్రభుత్వానికి డబ్బులు చెల్లించే విషయంలో జాప్యం చోటు చేసుకుంటున్నట్లు మార్కాపురం ఎక్సైజ్‌శాఖ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. మార్కాపురం తర్లుపాడు రహదారిలో ఉన్న మద్యం గోదాంలో సుమారు 60 మద్యం దుకాణాలకు ఇక్కడి నుంచే మద్యం పంపిణీ చేయాల్సి ఉందని, అందుకని దుకాణదారులకు మద్యం పంపిణీ చేసే విషయంలో కొంత జాప్యం చోటు చేసుకుంటుందన్నారు. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి తదితర ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలు తెరుచుకోలేదన్నారు. దుకాణదారులు మద్యంను కొనుగోలు చేసుకోవడంలోనూ జాప్యం జరిగి ఉండవచ్చని తెలిపారు. గురువారం నాటికి మద్యం దుకాణాలు పూర్తి స్థాయిలో తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసి వేయడం, మరొక పక్క ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోకపోవడంతో మద్యం ప్రియులు ఇబ్బందులు పడ్డారు.

వై.పాలెం సర్కిల్‌లో సగమే!

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే : కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన మొదటి రోజైన బుధవారం వై.పాలెం సర్కిల్ పరిధిలో సగం దుకాణాలే తెరచుకున్నాయి. కొత్తగా దుకాణాల ఏర్పాటు, ఇతరత్రా వసతుల కల్పన దృష్ట్యా అన్నీ తెరచుకోలేదు. సర్కిల్ పరిధిలోని వై.పాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో 15 దుకాణాలకు గాను ఆరు దుకాణాలు కార్యకలాపాలు ప్రారంభమైనట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. జాతీయ రహదారికి 220మీటర్లు, గుర్తింపు పొందిన పాఠశాలలు, ఆలయాలకు 100 మీటర్ల వ్యవధి ఉండాలని వివరించారు.◗ వై.పాలెం మండలంలోని అయిదు దుకాణాల్లో ఓ దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తి దుకాణాన్ని ఇతరులకు విక్రయించినట్లు సమాచారం. మిగతా దుకాణాలు దక్కించుకున్న వ్యక్తులు సిండికేట్‌గా మారి సదరు దుకాణాన్ని రూ. 25లక్షలు ఇచ్చి కొనుగోలు చేసినట్లు వార్తలొచ్చాయి. లాటరీలో దక్కించుకున్న వ్యక్తి ఆర్థిక నిర్వహణ, గతంలో వ్యాపారం చేసిన అనుభవం లేకపోవడంతో విక్రయించినట్లు తెలిసింది.

అందని కంది పప్పు

● మాయం చేసిన డీలర్లు!



యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో ఈ నెల చౌకదుకాణాల ద్వారా సరఫరా చేయాల్సిన కంది పప్పు మాయమైంది. నియోజకవర్గ గోదాము పరిధిలో ఈ మూడు మండలాల 120 దుకాణాలు, దొనకొండ, కుర్చేడు మండలాల్లోని మరో 12దుకాణాలతో కలిపి మొత్తం 132 చౌకదుకాణాలున్నాయి. అక్టోబర్ నెల సంబంధించిన బియ్యాన్ని చౌకదుకాణాల ద్వారా సరఫరా చేసిన అధికారులు కందిపప్పును సరఫరా చేయలేక పోయారు. వై.పాలెం గోదాముకు 55 టన్నులు కంది పప్పు రావాల్సిన ఉండగా ఈ నెల 4న 22 టన్నులు వచ్చాయి. వీటిని ఈ నెల 6న అన్ని చౌకదుకాణాలకు 60శాతం తరలించారు. అప్పటికే బియ్యం సరఫరా చేసిన చౌక దుకాణాల డీలర్లు కంది ఆలస్యంగా వచ్చినందున లబ్ధిదారులకు ఇవ్వలేక పోయారు. దసరాకు కంది కప్పు కోసం ఎదురు చూసిన బడుగు బలహీన వర్గాల ప్రజలు పండుగ రోజు కంది పప్పుకోసం ఎదురు చూసి నిరాశచెందారు. కొందరు డీలర్లను నిలదీస్తే కంది పప్పు సరఫరా లేదని, ఆలస్యం తమకు సరఫరా జరిగిందని, ఎండీయూ వాహనాలతో సరఫరా చేస్తామని చెపుతూ కాలం గడుపుతూ వస్తున్నారు. కొందరు డీలర్లు తమకు 40 శాతమే కందిపప్పు వచ్చిందని చెప్పి ఇవ్వకుండా దాచేశారు. కొందరు భయపడి ఒకరిద్దరికి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో కంది పప్పు కార్డుదారులకు చేరలేదు. ప్రజలు మాత్రం దసరాకు కందిపప్పును మాయం చేశారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గోదాం డీటీ భ్రమరాంభికను సంప్రదించగా ఈ నెల కింద 22 టన్నులు 60 శాతమే కందిపప్పు వచ్చిందని, అదీ ఆలస్యమైందని తెలిపారు. వాటిని చౌకదుకాణాలకు పంపించామని, అవి లబ్ధిదారులకు చేరిందా లేదా అనేది ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకే తెలియాలన్నారు. ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ రాధాకృష్ణ సంప్రదించగా కందిపప్పును డీలర్ల లబ్దిదారులకు ఎందుకు ఇవ్వలేదో తెలుసుకుని అన్ని విషయాలు త్వరలో తెలియజేస్తానని పేర్కొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామం వద్ద బుధవారం ఉదయం తెల్లవారు జామున అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై అదుపుతప్పి ఓ లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. కడప నుంచి యూరియా బస్తాలతో విజయవాడ వెళ్తున్న లారీ మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామానికి సమీపంలో (అమరావతి- అనంతపురం) రహదారిపై వేగాన్ని అదుపు చేసుకోలేక బోల్తాపడినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

కనిగిరి, న్యూస్‌టుడే:

సమస్య: కనిగిరి పట్టణంలోని ఎన్జీవోకాలనీలో రెండు వారాలుగా మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. అధికారులు స్పందించి మురుగు కాల్వలు శుభ్రం చేయించగలరు.

– సుబ్బమ్మ – ఎన్జీవోకాలనీ

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు నిల్వ లేకుండా చేస్తాం.

– నాయబ్ రసూల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని కాకర్ల పంచాయతీ శివరాయునిపేట బస్టాండు నుంచి కాలనీలోకి వెళ్లే రహదారి వెంట కాలువలు లేకపోవటంతో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది.

– బ్రహ్మం, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి శుభ్రం చేయిస్తాం.

– డేవిడ్, పంచాయతీ కార్యదర్శి.

మురుగు కాలువలు శుభ్రం

దర్శి, న్యూస్‌టుడే: దర్శిలోని టీచర్స్ కాలనీ ప్రారంభంలో పక్కా కాలువల్లో మురుగు పేరుకుపోయి రోడ్డుపైకి రావటంతో పాటు దోమలకు నిలయంగా మారింది. ఈ సమస్యపై 'మురుగు తొలగదు... దోమ చావదు' శీర్షికన ఈ నెల 14 వ తేదీన ఈనాడులో కథనం ప్రచురితమయింది. స్పందించిన నగరపంచాయతీ కమిషనర్ మహేష్ సిబ్బంది పంపి బుధవారం కాలువల్లో మురుగును తొలగింపజేశారు.

ఈనాడు కథనానికి స్పందన

పిచ్చిమొక్కల తొలగింపు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని కొత్తూరులో నెలకొన్న సమస్యలపై బుధవారం ఈనాడులో ' పట్టణ వాసం.. ప్రగతి దూరం..' శీర్షికన ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ పారిశుద్ధ్య సిబ్బందితో మురుగు కాల్వలు శుభ్రం చేయించారు. దీంతో పాటు మంచినీటిపథకం చుట్టు పెరిగిన పిచ్చిమొక్కలు తొలగింపజేయించారు.

జల దిగ్బంధంలో ప్రభుత్వ కార్యాలయాలు

పామూరు, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో పామూరు మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. డీవీ పాలెనికి దగ్గరలో సి.ఎస్.పురానికి వెళ్లే రహదారిపై మోకాలి లోతుకు పైగా నీరు చేరింది. ఇరువైపులా రోడ్డు పైపుల ఫ్యాక్టరీ దగ్గర నుంచి వచ్చే నీరు తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాల ముందుగా వెళ్లే వంకలు, కాలువలు, రోడ్లను సైతం కొందరు స్థిరాస్తి వ్యాపారులు, ఆక్రమణదారులు ఆక్రమించడంతో ఈ దుస్థితి నెలకొంది. ఆ నీటిలో నుంచే వెళ్తూ వాహన చోదకులు అవస్థలు పడ్డారు.



ఎంపీడీవో కార్యాలయంలోకి వెళుతున్న వరద

భైరవకోన సందర్శన నిలిపివేత

సీఎస్‌పురం, న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని శైవ పుణ్యక్షేత్రం భైరవకోనలోని జలపాతం జాలువారుతోంది. ఎత్తైన కొండల పైనుంచి పాలనురగను తలపించేలా నీళ్లు కిందికి దూకుతూ కనువిందు చేస్తోంది. ఎ.కొత్తపల్లి నుంచి భైరవకోనకు వెళ్లే మార్గంలో చప్టాలపై వర్షపు నీరు పారుతుండడం, కోనలో జలపాతం, దుర్గాంబ ఆలయాల ఎదుట వర్షపు నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో పోలీసులు, ఆలయ సిబ్బంది భక్తులు, సందర్శకుల రాకపోకలను నిలిపివేశారు. భైరవకోనను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బుధవారం సందర్శించి జలపాతాన్ని వీక్షించి ఆలయాల వద్ద వరద ఉద్ధృతిని పరిశీలించారు. కాలభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాంబ, శివలింగాలను దర్శించుకుని పూజలు చేశారు. వరద ఉద్ధృతి దృష్ట్యా భైరవకోన ఆలయ సందర్శనను రెండురోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, అధికారులు

పంటల పరిశీలన

మర్రిపూడి, న్యూస్‌టుడే: ఉద్యాన పైర్లలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని రైతులకు ఉద్యాన అధికారిణి ధనలక్ష్మీ సూచించారు. బుధవారం మండలంలోని గుండ్లసముద్రంలో సాగులో ఉన్న మిరప, బొప్పాయి తోటలను పరిశీలించారు. మిరపలో నీరు నిల్వ ఉండటంతో మొక్కలు ఉరకెత్తె అవకాశం ఉందని వాటి నివారణ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

పిడుగుపడి ఆలయంపై విగ్రహం ధ్వంసం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాకల గ్రామం పల్లెపాలెంలో జాలమ్మ తల్లి ఆలయ బాహ్యవిగ్రహంపై మంగళవారం అర్ధరాత్రి పిడుగు పడి విగ్రహం ఎడమ కాలు ధ్వంసమైంది. భారీ శబ్దంతో పిడుగు పడటంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

తాళ్లూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందువల్ల పంటలు దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు సూచించారు. మల్కాపురం, రజానగరం, విఠలాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పొలాల్లో నిలిచే నీటిని వెంటనే బయటకు తరలించాలన్నారు. ఈ పంట నమోదు జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక పరిజ్ఞానం కరపత్రాలను రైతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ అశోక్, వీహెచ్ఏలు రాజేష్, మార్టిన్ లూథర్, అమృత, తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం..



తాళ్లూరు శివారు పొలాల్లో ఒరిగిన వరి పైరు

కనిగిరి, తాళ్లూరు, దర్శి, పామూరు: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లోని పంట పొలాలన్నీ నీటమునిగాయి. కనిగిరి మండలంలో కంది, మినుము పైర్లు మునకెత్తాయి. పొలాల్లో చేరిన వరదను బయటకు పంపడానికి కర్షకులు నానా అవస్థలు పడుతున్నారు. తాళ్లూరులో వరిచేనులన్నీ నేలవాలాయి. కొన్ని చేనుల్లో కోతకు ముందే వరి మొలకలు వచ్చాయి. ఒక్కో ఎకరాకు రూ. 30 నుంచి 40 వేల వరకూ పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. దర్శి మండలంలోని సామంతపూడి, తూర్పువెంకటాపురం, ఇతర గ్రామాల్లో సజ్జ కంకులు కోసి రైతులు కల్లాల్లో ఉంచారు. వర్షాలకు తడవకుండా ఉండటానికి పరదాలు కప్పారు. మరికొన్ని రోజులు పరదాలు కప్పి ఉంచితే సజ్జ కంకులకు మొలకలు వచ్చి నిరుపయోగంగా మారుతాయని అన్నదాతలు భయపడుతున్నారు. బసిరెడ్డిపల్లి, బండివెలిగండ్ల, చందలూరు తదితర గ్రామాల్లో పత్తి పంట దెబ్బతింది.. పత్తి తీసే సమయంలో వర్షం కురవటంతో నల్లగా మారి పనికిరాకుండా పోయాయి. వర్షాలతో పూర్తిగా దెబ్బతినడంతో ఎకరానికి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పామూరు మండలంలోని గుమ్మనంపాడు, దూబగుంట్ల గ్రామాల్లో మినుము పంటను దెబ్బతింది.



కనిగిరి: కొత్తూరు వద్ద పొలంలో ఉరకెత్తిన నీటిని బయటకు పంపతున్న రైతు



పామూరు మండలం గుమ్మనంపాడులో నీట మునిగిన మినుము పంట



దర్శి: సజ్జ కంకులు తడవకుండా కప్పిన పరదాలు

పొంగిన వాగులు.. దెబ్బతిన్న రహదారులు..



టంగుటూరు పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో చేరిన వర్షపు నీరు

టంగుటూరు, ముండ్లమూరు, తాళ్లూరు, కొండపి, దర్శి, కనిగిరి: టంగుటూరు మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లోని వీధులన్నీ జలమయమయ్యాయి. మండలంలోని ఆలకూరపాడు సమీపంలోని మూసి, నిడమానూరు-ఉప్పలపాడు మధ్య మూసి, పొందూరు-కాకుటూరు మార్గంలోని వనగెరేడు వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఆలకూరపాడు గ్రామంలో జరగాల్సిన ఓ వివాహం వర్షం కారణంగా నిలిచిపోయింది. ● కొండపి మండలం కొండపి -ఉప్పలపాడు గ్రామాల మధ్య ఆట్లేరు, అన కర్లపూడి- మద్దులూరు, తాటాకులపాలెం- చిన్నకండ్లగుంట గ్రామాల మధ్య వాగులు పొంగడంతో అధికారులు జేసీబీ సహాయంతో ఇరువైపులా భారీ చెట్లను అడ్డంగా వేయించి రాకపోకలు నిలిపేశారు. ● దర్శి మండలంలోని సామంతపూడి, తూర్పువెంకటాపురం తదితర గ్రామాల్లో రహదారులు బురదమయంగా మారాయి. ● కనిగిరిలో చింతలపాలెంలో మట్టి రోడ్డు కోతకు గురయ్యాయి. ● ముండ్లమూరు మండలం మారెళ్ల, ఈదర గ్రామాల వద్ద వాగు పొంగడంతో చప్టాకి రెండు వైపులా చిల్లకంప వేసి రాకపోకలు నిలిపేశారు.



మారెళ్ల వద్ద చప్టాపై అడ్డుగా వేసిన చిల్లకంప



దర్శి మండలంలో సామంతపూడి గ్రామంలో ప్రధాన రోడ్డు దుస్థితి



కనిగిరి: చింతలపాలెం వద్ద కోతకు గురైన రోడ్డు



టంగుటూరు మండలం నిడమానూరు, కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామాల మధ్య పహారా కాస్తున్న పోలీసులు

శిథిల భవనాలు.. కూలేందుకు సిద్ధం..

కనిగిరి, న్యూస్‌టుడే:

కనిగిరి పట్టణంలో అనేక చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఏ క్షణం ఏ కట్టడం కూలుతుందోనని ప్రజలు జంకుతున్నారు. గతంలో కాలం చెల్లిన భవనాలను మున్సిపల్ అధికారులు గుర్తించారు. పాత భవనాలను కూల్చివేసి కొత్త భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. కాని ఎవరు స్పందించ లేదు. గత అయిదు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ సమయంలో సదరు భవనాలు నాని పోయి కుప్ప కూలే ప్రమాదం ఉంది. ఇవన్నీ జన సంచారం ఉండే ప్రాంతాలు కావడం ఆందోళనకరం.


పట్టణం	కనిగిరి
మొత్తం గృహాలు	10,463
గుర్తించిన శిథిలి భవనాలు	200
తొలగించాల్సినవి	50



ఒంగోలు బస్టాండ్‌లో ప్రమాదకరంగా ఉన్న పాత భవనం

ఈ ప్రాంతాల్లో పాత భవనాలెక్కువ

కనిగిరి పట్టణంలోని కొత్తపేటలో 30 ఏళ్లుగా పాడుబడిన భవనం అలాగే ఉంది. దాన్ని కూల్చేందుకు చర్యలు తీసుకోవడం లేదు. నిత్యం ఇక్కడ జన సంచారం ఉంటుంది. విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. పరాశర భారతి పాఠశాల వీధిలో ఓ భవనం శిథిలావస్థకు చేరింది. దీన్ని కూల్చివేయాలంటూ గతంలో కొందరు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాగే కూరగాయల మార్కెట్, బొడ్డు చావిడి సెంటర్, లాడేసాహెబ్‌వీధి, నక్కల తిప్ప, పాతూరు, ఒంగోలు బస్టాండ్, ఎన్జీవో కాలనీ, ఇందిరాకాలనీలో, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు చాలా వరకు ఉన్నాయి. ఇక పట్టణంలో సామాజిక వైద్యశాల గురించి ప్రత్యేకంగా చెప్పనకరలేదు. ఈ ఏడాది జనవరిలో శ్లాబ్ పెచ్చులూడి విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై పడి గాయాలయ్యాయి. డిప్యూటీ డీఎంహెచ్‌వో విధులు నిర్వహించే భవనం 40 ఏళ్ల కిందట నిర్మించడంతో పాతదై మొక్కలు సైతం మొలిచాయి. గతంలో పట్టణంలోని నాలుగో వార్డులో కురిసిన వర్షాలకు ఓ శిథిల భవనం కూలి వృద్ధురాలు మృతి చెందింది. మూడేళ్ల క్రితం గ్రంథాలయం వద్ద ఉన్న భవనం అకస్మాత్తుగా కుప్పకూలింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేక పోవడంతో అప్పట్లో ప్రాణ నష్టం తప్పింది. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా పట్టణ ప్రణాళిక అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ కె.దానియెల్ జోసెఫ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు ఇస్తామన్నారు.



డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయం మొక్కలు మొలచి శిథిలమైంది ఇలా...

వెలుగని దీపం.. అలుముకున్న అంధకారం..



కనిగిరి పట్టణంలోని సాయినగర్‌లో గత మూడు రోజులుగా వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటం.. పైగా రాత్రి వేళ దీపాలు వెలగక పోవడం.. ఈ ప్రాంతం అంతా చిల్లచెట్లు, కొండ ప్రాంతం కావడంతో విషపురుగులు తిరుగుతుండటం మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే వీధి దీపాలు వెలిగేలా చూడాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావును వివరణ కోరగా వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కనిగిరి

వరదొచ్చి.. కల్వర్టు కూలి..



మండలంలోని దారంవారిపాలెం- తూర్పుగంగవరం మార్గంలోని కొండవాగు కల్వర్టు బుధవారం ధ్వంసమైంది. గత నాలుగు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆ కల్వర్టుకు ఓవైపునున్న సిమెంటు శ్లాబ్ పగలిపోయి కోతకు గురైంది. కాజ్‌వే మధ్యవరకూ కోతకు గురవడంతో ఆ వైపుగా ఏవేని వాహనాలు (ద్విచక్ర వాహనాలు మినహా) రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా పోతోంది. నిత్యం ఇటువైపుగా అధిక సంఖ్యలో రైతులు ఎరువులు, పశువులకు దాణాకోసం, రైతు ఉత్పత్తులను తరలించేందుకు ఈ రహదారే ప్రధాన ఆధారం. అయితే ప్రస్తుతం కల్వర్టు దుస్థితికి చేరడంతో ఏం చేయాలో అర్థంకాక ఆ ప్రాంత రైతులు, తదితర వర్గాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

– న్యూస్‌టుడే,తాళ్లూరు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దర్శి, న్యూస్‌టుడే: దర్శిలో బుధవారం గుండె పోటుతో కాలూరి గురవయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటరెడ్డి, వేణు, జనార్ధనరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజకేశవరెడ్డి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శిద్దా సుధీర్ జన్మదిన వేడుకలు

తాళ్లూరు, న్యూస్‌టుడే : యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గుంటిగంగలో ఉన్న తేజ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. చీమకుర్తికి చెందిన పలువురు ప్రముఖులు ఆశ్రమానికి వచ్చి ముందుగా కేక్‌కోసిన కేక్, మిఠాయిలు, పండ్లు పంచి పెట్టారు. ఈసందర్భంగా అక్కడున్న వారందరికీ అన్నదానం చేశారు. ఆశ్రమం నిర్వాహ కుడు అంబటి వెంకటేశ్వరెడ్డికి మొక్కను కూడా అందజేశారు. ● దర్శిలోని షిర్డి సాయి, వెంకటరమణ ఆశ్రమాల్లోని వృద్ధుల సమక్షంలో కేకు కోసి అన్నదానం చేపట్టారు.

మద్యం సీసాల పట్టివేత

పామూరు, న్యూస్‌టుడే: పామూరులో మద్యం గొలుసు దుకాణంలో విక్రయించేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన 41 మద్యం సీసాలను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో మద్యం గొలుసు దుకాణాలు నిర్వహించినా, అక్రమ రవాణా చేసినా దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూదరుల అరెస్టు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: జూదమడుతున్న అయిదుగురిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి గ్రామం దాసిరెడ్డిపాలెంలో జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడి చేశారు. అయిదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,620 నగదును స్వాధీనం చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ అనిల్ తదితరులు ఉన్నారు.

తెరుచుకోని మద్యం దుకాణాలు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బుధవారం 19 మద్యం దుకాణాలు ప్రారంభం కావాల్సి ఉంది. నెట్ బ్యాంకింగ్ ఆలస్యం కావడం, కొంత మందికి కరెంట్ ఖాతా లేకపోవడంతో సరకు కొనుగోలుకు సంబందించి చలానాలు బ్యాంకుల్లో కట్టడం ఆలస్యమవ్వడంతో ప్రారంభం కాలేదు. ● కనిగిరి పట్టణంలోని తీగలగొందిలో మద్యం దుకాణం ఏర్పాటును మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు అభ్యంతరం తెలపడంతో గతంలో ఉన్న మద్యం దుకాణాన్ని పోలీస్ స్టేషన్ ఎదుట కాంప్లెక్స్‌లోకి మార్చారు. అదే విధంగా కనకపట్టణంలో పాత మద్యం దుకాణం స్థానంలో కొత్త మద్యం దుకాణం ఏర్పాటును స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలు నివసించే చోట మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం సబబు కాదని ఎక్సైజ్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ● దర్శి: దర్శి నియోజకవర్గంలోని మొత్తం 23 దుకాణాల్లో కేవలం రెండింటిని ప్రారంభించినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దర్శిలో అద్దంకి రోడ్డులో బస్టాండు సమీపంలో పాత ప్రభుత్వ మద్యం దుకాణంలో ఒకటి, రాజంపల్లిలో ఒకటి ప్రారంభించారు. ఇవి కూడా రాత్రి ఆలస్యంగా ప్రారంభం అవటంతో మందుబాబులకు ఎదురు చూపులు తప్పలేదు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

తాళ్లూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తురకపాలెం, దారంవారిపాలెం, మాధవరం గ్రామాల్లో రూ. 60 లక్షలతో చేపడుతున్న సీసీ రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆమె భర్త కడియాల లలిత్‌సాగర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల సారథ్యంలో తక్కువ సమయంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డీఎల్‌డీఓ ఉషారాణి, ఎంపీడీఓ సుందరరామయ్య, తహసీల్దారు రాజ్యలక్ష్మి, ఏపీఓ మురళి, సర్పంచి గుర్వారెడ్డి మండల తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● పొన్నలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని తెదేపా మండలాధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు తెలిపారు. మండలంలోని వెంకుపాలెం గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లతో తలపెట్టిన నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, మాదాల ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లూరు: తురకపాలెంలో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గొట్టిపాటి లక్ష్మి లలిత్‌సాగర్ దంపతులు, నాయకులు

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు



వరద నీరు పోయేందుకు వీలుగా డీమార్ట్ ఎదుట కాలువపై తొలగించిన ర్యాంపు



కాలనీలో ఇళ్లలోకి చేరిన నీరు

కన్నీట శివారు కాలనీలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: బుధవారం కురిసిన భారీ వర్షానికి నగరంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. మోటూరు ఉదయం కాలనీ, బలరాం కాలనీ, భరత్‌నగర్, నెహ్రూనగర్ ఎక్స్‌టెన్షన్, మదర్ థెరెసా కాలనీ, బాలినేని కాలనీల్లోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. కాలువలు పూడిపోయి భాగ్యనగర్ నాలుగు, అయిదు లైన్లలోనూ ఇదే సమస్య తలెత్తింది. రెవెన్యూ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలకు రావాలని కోరినా... ఇళ్లలో సామగ్రి ఉన్నందున వెళ్లేందుకు ఇష్టపడ లేదు. ఇళ్లకే ఆహారం సరఫరా చేయాలని కోరారు. గోరంట్ల కాంప్లెక్స్ సమీపంలోని ఆగ్జేలియం, రామనగర్‌లోని మున్సిపల్, మంగమూరు రోడ్డులోని సత్యసాయి, కర్నూలు రోడ్డులోని సెయింట్ జేవియర్స్ పాఠశాలల్లో పునరావాసానికి ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తినా హెల్ప్‌లైన్ నంబర్లకు తెలియజేయాలని కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలో వాన నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా... కాలువలపై ర్యాంపులు తొలగించినట్లు చెప్పారు.

కలెక్టర్ పర్యటన... : లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆర్టీవో కార్యాలయం సమీపంలోని బాలినేని కాలనీ, మదర్ థెరెసా కాలనీల్లో మేయర్ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్నతో కలిసి పర్యటించారు. జిల్లాలో మొత్తంగా 35 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు 200 మందిని ఆయా కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. ముదిగొండ వాగు ప్రవాహంతో కొప్పోలు - కరవది రోడ్డులో మునిగిపోయిన చప్టాను పరిశీలించారు.



మదర్‌థెరెసా కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పునరావాస కేంద్రాల పరిశీలన : కొత్తపట్నం: జడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను డీపీవో జీవీ నాయుడు పరిశీలించారు. భోజనం, ఇతర వసతులపై ఆరా తీశారు. లోతట్టు కాలనీకి చెందిన 121 మందిని అక్కడకు తరలించారు. సముద్ర తీరానికి సందర్శకులు రాకుండా పోలీసు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. ● ఒంగోలు గ్రామీణం: ప్రగతి భవన్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక శాఖ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు... పాత రిమ్స్ ఆవరణలోని పలు కార్యాలయాల్లోకి నీరు చేరడంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

చేపలు కొట్టుకుపోయి రూ.3 లక్షల నష్టం

ఒంగోలు గ్రామీణం : ఒంగోలు మత్స్యకార సంఘం పరిధిలోని పెళ్లూరు చెరువు పొంగి... అందులోని చేపలు బయటకు పోవడంతో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. కాలువలో రైతులు ఏర్పాటు చేసిన ఇనుప వలలు సైతం దెబ్బతిన్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.



పునరావాస కేంద్రంలో వసతులు తెలుసుకుంటున్న డీపీవో జీవీ నాయుడు

రేషన్ బండి రావడం లేదు!

శ్రీనగర్ కాలనీ (ఒంగోలు అంజయ్యరోడ్డు) - న్యూస్‌టుడే: ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీకి ఉద్దేశించిన ఎండీయూ వాహనం... గత రెండు నెలలుగా తమ ప్రాంతానికి రావడం లేదని శ్రీనగర్‌కాలనీ మూడో లైన్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క వీధికి వాహనం వచ్చినప్పుడు వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏదైనా పనిలో ఉండి వెళ్లలేక పోతే ఆ నెలకు సరకులు అందడం లేదని చెబుతున్నారు. తమ ప్రాంతానికి వచ్చి సరకులు ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని... సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం... గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గత పాలకుల తప్పు... వెన్నాడుతున్న ముప్పు

ఏ మాత్రం భారీ వర్షం పడినా ఒంగోలు నగరం వణికపోతోంది. శివారు కాలనీలు, లోతట్టు ప్రాంతాల జలమయమై రెండు మూడు రోజుల పాటు అవస్థలు తప్పడం లేదు. ఇటు పోతురాజు, అటు నల్ల కాలువలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు. ఆ దిశగా అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో అడుగులు పడినా... తరువాత వచ్చిన వైకాపా సర్కారు నిర్లక్ష్యం చేయడంతో నేటికీ చిక్కులు తప్పడం లేదు.

- న్యూస్‌టుడే - ఒంగోలు నగరం



నీట మునిగిన నగరంలోని కర్నూలు రోడ్డు

◆ ప్రధాన కాలువల అభివృద్ధిని విస్మరించిన ఫలితం

వైకాపా పాపం... పోతురాజుకు శాపం

ఒంగోలులోని దాదాపు 70 శాతం ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వరద... ఉత్తరం వైపున ఉన్న పోతురాజు కాలువ ద్వారానే బయటకు వెళ్లాలి. ఇది పేర్నమిట్ట నుంచి కొప్పోలు సమీపంలోని చింతల వరకు విస్తరించి ఉంది. అక్కడి నుంచి పంట కాలువల ద్వారా సముద్రంలో కలుస్తుంది. ఈ ప్రాధాన్యం దృష్ట్యా 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం పోతురాజు అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించి రూ.85 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పనులు రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచింది. ఇరవై శాతం తక్కువకు కోట్ చేసి... దాదాపు రూ.69 కోట్లకు గుత్తేదారు దక్కించుకున్నారు. కరోనా పేరిట రెండేళ్ల పాటు పనులే ప్రారంభించలేదు. అనంతరం విరాట్ నగర్ నుంచి శ్రీరామ్ కాలనీ వరకు పూడిక తీయించి... ఆ పరిధిలో కొంతమేర రక్షణ గోడ కట్టారు. కరవది డొంక రోడ్డులో కల్వర్టు నిర్మించారు. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కట్టిన గోడ కొంతమేర కూలిపోయింది. తరువాత... గిట్టుబాటు కావడం లేదంటూ గుత్తేదారు చేతులెత్తేశారు. ప్రభుత్వం ఆ పనులు రద్దు చేయడంతో నేటికీ సమస్య కొనసాగుతోంది.




రూపు కోల్పోయిన పోతురాజు కాలువ

వాస్తవానికి ఈ రెండు కాలువలు జలవనరుల శాఖ పరిధిలో ఉన్నాయి... సాగు నీటి పరంగా వినియోగంలో లేవు. మురుగు, వరద పారుదలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. పోతురాజు కాలువను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.80 కోట్లు, నల్లకాలువ ఆధునికీకరణకు రూ.30 కోట్లు... మొత్తంగా రూ.110 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఈ మేరకు ప్రతిపాదనలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తీసుకెళ్లారు. సమస్య తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు సాధించి పనులు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

నల్ల కాలువనూ నిర్లక్ష్యం చేశారు...

నగరంలో దక్షిణం వైపున ఉన్న 30 శాతం ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వరద నల్లకాలువ ద్వారా బయటకు వెళ్తుంది. ఇది మంగమూరు నుంచి చింతల వరకు విస్తరించి ఉంది. గత అయిదేళ్లుగా కనీస నిర్వహణ లేక పూర్తిగా పూడిపోయింది. జమ్ము, చిల్ల చెట్లు పెరిగి పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. ఆక్రమణలూ చోటుచేసుకున్నాయి. అన్నర్ రమేష్ ఆసుపత్రి పక్కనున్న మొండి వాగును నల్లకాలువకు అనుసంధానిస్తే... భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ప్రగతినగర్, సంతపేట, రామనగర్ ప్రాంతాలకు ముంపు ముప్పు తప్పుతుంది. బైపాస్ అవతల ఉన్న వడ్డెపాలెం, జెప్పీకాలనీ, మదర్ థెరెసా కాలనీ, బాలినేనికాలనీ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వరద... ఆర్టీవో కార్యాలయం పక్కనున్న నల్లకాలువకు తరలిస్తే ఆయా కాలనీల్లో సమస్యన్నదే ఉండదు. ఈ కాలువ అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించడంతో నేటికీ అదే పరిస్థితి. పైగా... అన్నర్ రమేష్ ఆసుపత్రి వద్ద కల్వర్టు కుంగిపోవడంతో మురుగు వెనక్కు ఎగదన్నుతోంది.



అన్నర్ రమేష్ ఆసుపత్రి సమీపంలో నల్ల కాలువ పరిస్థితి ఇది



కరవది-గుత్తికొండవారిపాలెం రహదారిలో ముదిగొండ వాగు ఉద్ధృతి



ఒంగోలు - మంగమూరు రోడ్డులో నల్లవాగు ప్రవాహం



ఒంగోలు - చీరాల మార్గంలో బారికేడ్లు అడ్డుపెట్టి వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

పొంగిన వాగులు... నిలిచిన రాకపోకలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోని పలు వాగులు పొంగి పొర్లడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా దారుల్లో ఎవరూ ప్రయాణించకుండా అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు - మంగమూరు మధ్య నల్లవాగు; చిలకపాడు-ఎం.వేములపాడు; మాచవరం - మద్దులూరు మధ్య [illegible] వాగులు పొంగాయి. తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, ఎస్సై అజయ్‌బాబు ఆయా ప్రాంతాలను పరిశీలించారు.

● ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం: ముదిగొండ వాగు పొంగి కరవది - గుత్తికొండవారిపాలెం మధ్య, పెద్దవాగు ఉద్ధృతితో ఈతముక్కల - ఆలకూరపాడు మధ్య ప్రయాణాలు నిలిచిపోయాయి. తహసీల్దార్ మధుసూదనరావు పరిశీలించారు.

● మద్దిపాడు: కొష్టాల కూడలి - గురవారెడ్డి పాలెం, నేలటూరివారిపాలెం, గురవారెడ్డిపాలెం, పెదకొత్తపల్లి మధ్య ముదిగొండ వాగు; గ్రోత్ సెంటర్ - నాగులుప్పలపాడు దారిలో కొత్తకోట వాగు పొంగడంతో రాకపోకలు ఆపేశారు. తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జ్యోతి ఆయా ప్రాంతాలను పరిశీలించారు.

● నాగులుప్పలపాడు: చదలవాడలో రామన్న చెరువుకు రెండు చోట్ల గండి పడడంతో... 216 జాతీయ రహదారిపైకి నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి... కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించి నీటి ఉద్ధృతి తగ్గేవరకు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ప్రాజెక్టు ఎస్‌ఈ అబ్దుల్ అలీం ఉన్నారు. నాగులుప్పలపాడు - తిమ్మసముద్రం, నిడమనూరు - కొత్తకోట మధ్య హనుమాయమ్మ వాగు ఉద్ధృతి కొనసాగుతోంది. మాచవరం సమీపంలో [illegible] వాగు కట్ట తెగి పంటపొలాలు నీట మునిగాయి.

రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: వచ్చే అయిదేళ్లలో గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పల్లె పండగలో భాగంగా సంతనూతలపాడులో రూ.85 లక్షలు, రుద్రవరంలో రూ.30 లక్షలు, మంగమూరులో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కాలువల పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.21 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో సంతనూతలపాడు మండలానికి రూ.5 కోట్లు కేటాయించామన్నారు. సంతనూతలపాడులో రహదారుల నిర్మాణానికి ప్రాంతాలను పరిశీలించారు. ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు కృష్ణమోహన్, రామ్మోహన్, శరత్, ఎంపీపీ బి.విజయ, తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు, కూకట్ల విజయమ్మ, శరత్, స్వాములు, నారాయణరావు, ఉబ్బూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, ఎంపీడీవో కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరంలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం: 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు: 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు, న్యూస్‌టుడే:

?: మద్దిపాడులో హైవే నుంచి కెనరా బ్యాంకుకు వెళ్లే దారిలో వ్యర్థాలతో పాటు ఖాళీ కొబ్బరి బొండాలు పారబోస్తున్నారు. వర్షాలకు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి.

– కె.రామాంజనేయులు, గ్రామస్థుడు

✓: సిబ్బందిని పంపి ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. – నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

?: గుండ్లాపల్లి ప్రధాన బజారులో కాలువలు లేక రోడ్డు పైనే నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

– జె.శివకృష్ణ, స్థానికుడు

✓: పరిశీలించి... సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

– లతీఫ్, పంచాయతీ కార్యదర్శి

పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మండువవారిపాలెం, దశరాజుపల్లె గ్రామాల్లో రూ.70 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రభుత్వ పథకాల అర్హులైన వారి వివరాలు సేకరించాలన్నారు. ఎంపీడీవో రాజశేఖర్, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్

పేదలకు దుప్పట్ల పంపిణీ

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ కిష్ట సుధీర్‌కుమార్ జన్మదిన వేడుకలు చీమకుర్తిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కేకులు కోసి మిఠాయిలు పంచిపెట్టారు. ఎస్కేఆర్ బధిరుల పాఠశాల పిల్లలకు, తూర్పు గంగవరంలోని వృద్ధాశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేశారు. పాటిమీదపాలెం పాఠశాలలో మొక్కలు నాటారు. చీమకుర్తి గంగకాలనీలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో గోల్డెన్ గ్రానైట్ క్వారీ మేనేజర్ ఎ.గిరిబాబు, తెదేపా నాయకులు కాట్రగడ్డ రమణయ్య, రాఘవరావు, గంగాధరరావు, మండవ శ్రీనివాసరావు, మండవ గోపి, బొమ్మిశెట్టి కిరణ్, నూకల సురేంద్ర, గ్రంధి శ్రీహరి, చల్లగండ్ల హనుమంతరావు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గంగాకాలనీలో దుప్పట్లు అందజేస్తున్న నాయకులు

రాయితీ శనగ విత్తనాలకు పేర్ల నమోదు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రాయతీ శనగ విత్తనాల కోసం గురువారం నుంచి రైతుల వివరాలు నమోదు చేస్తున్నట్లు ఏవో పి.పావని తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సహాయకుల ద్వారా ఈ పక్రియ కొనసాగుతుందని... కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొలిరోజు 8 దుకాణాలు ప్రారంభం

సంతనూతలపాడు, చీమకుర్తి – న్యూస్‌టుడే: చీమకుర్తి ఎక్సైజ్ శాఖ పరిధిలో మొత్తం 16 దుకాణాలు కేటాయించగా... బుధవారం ఎనిమిది మాత్రమే ప్రారంభమయ్యాయి. మద్దిపాడు మండలంలో మూడు దుకాణాలకు గానూ ఒక్కటీ తెరవలేదు. గురువారం అన్నీ తెరుచుకుంటాయని సీఐ సుకన్య తెలిపారు.

డీఎస్పోకు అభినందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన డీఎస్పో పద్మశ్రీని ఏపీఆర్ఎస్ఏ జిల్లా నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, కోశాధికారి డానియేలు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీరోడ్డులో ట్రాఫిక్ చిక్కులు



నగరంలోని ప్రధాన వాణిజ్య కూడలి గాంధీ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయి. వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ, ఎలక్ట్రానిక్స్ తదితర దుకాణాలు కొలువుదీరడంతో జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది వినియోగదారులు వస్తుంటారు. అనుబంధంగా ఉన్న బజార్ల నుంచి వాహనదారులు నేరుగా ప్రధాన మార్గంపైకి వస్తుండడంతో చిక్కులు తలెత్తుతున్నాయి. పేరుకు వన్‌వే అయినప్పటికీ... రాంగ్‌రూట్‌లో కొందరు రాకపోకలు సాగిస్తుండడం, అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతుండడంతో సమస్య నెలకొంటోంది. ట్రాఫిక్ సిబ్బంది ఉంటున్నా... సాయంత్రం వేళల్లో నియంత్రించడం కష్టమవుతోంది. తగిన చర్యలు తీసుకోవాలని అక్కడివారు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు



రెవెన్యూ కాలనీలో ఇలా..

మట్టిదారులే ఆధారం!



విలేకరుల కాలనీలో పరిస్థితి

మంగమూరు రోడ్డుకు అనుసంధానంగా ఉన్న కాలనీల్లో అంతర్గతదారులు నిండా గోతులతో అధ్వానంగా తయారయ్యాయి. గత అయిదేళ్లలో ఆయా మార్గాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంతో సమస్య నెలకొంది. రెవెన్యూ కాలనీ, విలేకరుల కాలనీ అయిదో లైన్ తదితర ప్రాంతాల్లో నేటికీ మట్టిదారులే ఆధారంగా ఉన్నాయి. వర్షాలకు అవి చిత్తడిగా మారడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలవారు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మంగమూరు రోడ్డు (ఒంగోలు అంజయ్యరోడ్డు)



నలుగురిని పొట్టన పెట్టుకున్న దోర్నపువాగు ఇదే



ముండ్లమూరు మండలంలోని ఈదరవాగు ఉద్ధృతి

వాగుల గండం..!

❖ వానొస్తే గ్రామాలకు తెగిపోతున్న సంబంధాలు
❖ పట్టించుకోని గత పాలకులు
❖ వారధులు నిర్మించక అవస్థలు

ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే బృందం:

వాగుల గండం జిల్లావాసులను వెంటాడుతోంది. చిరు జల్లు పడినా ఇవి విరుచుకుపడుతుండటంతో రాకపోకలు రెండు, మూడు రోజుల పాటు నిలిచిపోతున్నాయి. కళ్లముందే పంటపొలాలు మునిగి.. మూగజీవాలు వాగుల్లో కొట్టుకుపోయి గ్రామస్థులు బిక్కుబిక్కుమంటున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు పొంగుతున్నాయి. వారధులు నిర్మిస్తేనే దీనికో పరిష్కారం లభిస్తుంది.

ప్రాణాలు తీస్తున్న ..

తాళ్లూరు-ముండ్లమూరు ర.భ.మార్గంలో విఠలాపురం వద్ద ఉన్న దోర్నపు వాగు పొంగిన వేళ ఆ మార్గంలో వెళ్లాలంటే గుండెజారిపోతోంది. కొన్నేళ్ల క్రితం ఇక్కడ నీటి ఉద్ధృతికి లారీ బోల్తాపడి ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు పశువుల కాపరులు వాగులో కొట్టుకుపోయి చనిపోయారు. రెండు రోజులుగా ఇది పొంగి ప్రవహిస్తుండటంతో స్థానికులు భీతిల్లుతున్నారు.

దాటాలంటే బిక్కుబిక్కు..

కంభం మండలంలోని ఎర్రబాలెం వద్ద ఉన్న గుండ్లకమ్మ వాగు పొంగితే అక్కడి నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాళ్లూరు మండలంలోని రజానగరం వాగుకు వరద పోటెత్తితే తాళ్లూరు - అద్దంకి మండలాల మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి. ముండ్లమూరు మండలంలోని మారెళ్ల-జమ్మలమడక గ్రామాల మధ్య ఉన్న ఈదరవాగు; పొదిలి - మార్కాపురం మార్గంలోని బట్టువారిపల్లి వాగు వద్ద ముప్పు పొంచివుంది. అక్కడ వంతెనలు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడంలేదు. ఒంగోలు-కర్నూలు ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఊరచెరువు నీరు ముంచెత్తడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వైకాపా పట్టించుకోక..చంద్రన్న చెంతకు..

నాగులుప్పలపాడు నుంచి గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వరకు 12 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారిలో కొత్తకోట, హనుమాపురం, నిడమానూరు వాగులున్నాయి. వర్షాలు పడితే ఇవి పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. స్థానికులు తమ గోడు వైకాపా పాలకులకు విన్నవించినా వారు పట్టించుకోలేదు. దీంతో ఇటీవల మద్దిరాలపాడుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వాటిపై వారధులు కట్టాలని విన్నవించారు.



పొంగి పొర్లుతున్న కొత్తకోట వాగు

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులో పర్యటించారు. చాలా ప్రాంతాల్లో వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

మత్తు మందిచ్చి బంగారు ఆభరణాల చోరీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి బంగారు ఆభరణాలు దోచుకున్న సంఘటన ఒంగోలు గోపాల్‌నగర్ మూడోలైనులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సత్యవాగంటి స్వరాజ్యం అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తున్నారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని ఆగంతకుడు ఆమె ఇంటిలోకి ప్రవేశించాడు. అనంతరం ఆమెకు మత్తు ఇచ్చి మెడలోని రెండు బంగారు గొలుసులతో పాటు, ఇంట్లోని 15 సవర్ల బంగారు ఆభరణాల్ని అపహరించుకుని పోయాడు. అర్ధరాత్రి వేళలోనూ ఇంటి తలుపులు తెరిచి ఉండటం, లైట్లు వెలుగుతుండటంతో స్థానికులు పక్క వీధిలో నివసించే ఆమె కుమారుడికి సమాచారం ఇచ్చారు. అతను వచ్చి పరిశీలించగా తల్లి అపస్మారక స్థితిలో ఉండటంతో వైద్యశాలకు తరలించారు. ఆమెపై మత్తు ప్రయోగించినట్లు పరీక్షల్లో గుర్తించారు. వృద్ధురాలి మెడలోని రెండు బంగారు గొలుసులు, చేతికి ఉన్న గాజులతో పాటు ఇంట్లో బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఒంగోలు రెండో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.



కార్యాలయం ఆవరణలో నిలిచిన నీరు

అడ్డగోలు నిర్మాణంతో అవస్థ

పాత జాతీయ రహదారిలో జవహర్ నవోదయ సమీపంలోని జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు కార్యాలయం దుస్థితి ఇది. ఈ సమీపంలో అడ్డగోలు నిర్మాణం చేసిన వైకాపా కార్యాలయం కారణంగా... వరద నీరంతా వచ్చి కార్యాలయం ఆవరణలో నిలిచిపోతోంది. గదుల్లోకి అడుగు మేర నీరు చేరుతోంది. పురాతన నిర్మాణం కావడం, ఇప్పటికే శ్లాబు, గోడలు ఉరుస్తుండడంతో... భవనం సామర్థ్యం దెబ్బతింటోంది.

– ఈనాడు, ఒంగోలు



గదుల్లోకి నీరు చేరడంతో ఇలా...

మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఎన్‌సీఈఆర్‌టీలో డిప్యుటేషన్‌పై పనిచేసే పోస్టులకు అర్హత గల మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో కోరారు. అధ్యాపక పోస్టుల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. వాటికి ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల పరిధిలోని టీచర్లు అర్హులని చెప్పడం సరికాదన్నారు.

కొండ చిలువ పట్టివేత

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మేడపిలో బుధవారం రాత్రి కొండ చిలువ కలకలం రేపింది. నల్లూరి వెంకట్రావు వాటర్ ప్లాంటు వద్ద ఉన్న తొట్టిలో 15 అడుగుల కొండ చిలువ కనిపించింది. దీంతో సమాచారం అందుకున్న అటవీ శాఖ రెస్క్యూవర్ మల్లికార్జున్ వచ్చి దాన్ని పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు.

డ్వాక్రా నిధుల గోల్‌మాల్‌పై విచారణ

జరుగుమల్లి, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల మహిళలు చెల్లించాల్సిన రుణాల నగదును సిబ్బంది స్వాహా చేసిన ఉదంతంపై అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం కొండపి ప్రాంత సమన్వయకర్త కత్తి కల్యాణ్ వెలుగు మహిళలతో దీనిపై మాట్లాడారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని అయిదు గ్రూపులకు సంబంధించిన మహిళలు గతంలో రూ.20 లక్షల వరకు నగదు రుణాలు తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రతి నెల స్థానిక కెనరా బ్యాంకుకు నగదును విడతల వారీగా చెల్లిస్తున్నారు. స్థానికంగా వీవోఏగా విధులు నిర్వహిస్తున్న జ్యోతికి మహిళా సంఘాల సభ్యులు రుణాల నగదును అందించేవారన్నారు. అయితే ఆమె నగదును బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు బాధితులు తెలిపినట్లు ఆయన చెప్పారు.

పోలీసులకు ఫిర్యాదుతో..

రుణాల నగదు స్వాహా తతంగం అయిదు నెలలుగా సాగుతుండటం, రుణాలు చెల్లించిన నగదుకు సంబంధించిన రసీదులు ఇవ్వకపోవడంతో అనుమానమొచ్చి బాధిత మహిళలు మంగళవారం వీవోఏను నిలదీశారు. బాధ్యురాలిపై చర్యలు తీసుకోవాలని గ్రూపులోని యాభై మంది సభ్యులు మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీంతో విషయం తెలుసుకున్న శాఖ అధికారులు కొండపి ఏరియా కోఆర్డినేటర్ కల్యాణ్, లీగల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం జయరాజు, సీసీలను విచారణ నిమిత్తం జరుగుమల్లికి పంపించారు. దీనిపై వీవోఏ జ్యోతిని గ్రూపు సభ్యుల ముందు విచారించగా వాస్తవమేనని అంగీకరించారు. సుమారు రూ.6 లక్షల నగదు సొంత అవసరాలకు వినియోగించినట్లు ఆమె చెప్పారు. డిసెంబర్ నాటికి పూర్తిగా చెల్లించేందుకు అంగీకరించినట్లు విచారణాధికారులు తెలిపారు. ఈ మేరకు బాధితులు తెలిపిన వివరాలు, ఇతర అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణ అధికారులు తెలిపారు. వెలుగు మహిళలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



విచారణకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న మహిళా సంఘాల గ్రూపు సభ్యులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రాయతీపై ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రైతు సంక్షేమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. . 2024-25కు సంబంధించి పంట నమోదు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. రాయతీ మినుము విత్తన కిట్‌లను రైతులకు అందజేశారు. ముందుగా సిండికేట్ రైతు సహకార సొసైటీలో ఎరువులు, స్టాక్ రిజిస్ట్రర్లను పరిశీలించారు. సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, ఏవో పి.పావని, ఏఈవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాయితీ మినుము విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, జేడీఏ శ్రీనివాసరావు

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 505 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 157, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 259



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా నాయకులు

వెలిగొండకు నిధులు కేటాయించరూ!

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా సీపీఐ నాయకులు బుధవారం విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయంలో ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని 36 మండలాలకు తాగు, సాగునీటి సమస్య తీరనున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 11 ముంపు గ్రామాల నుంచి 7,500 మంది నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కింద నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లు అవసరమన్నారు. ఈ మేరకు ప్రాజెక్టును త్వరలోనే సందర్శించి, పనుల పూర్తికి నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, నాయకులు కె.వెంకటరావు, కె.వీరారెడ్డి తదితరులు రాష్ట్ర మంత్రిని కలిశారు.

విధులు నిర్వహిస్తూ.. కుప్పకూలి..

దర్శి, న్యూస్‌టుడే: విధులు నిర్వహిస్తూ ఓ ఉద్యోగి కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు దర్శి ఆర్‌డబ్ల్యూఎస్‌లో హెచ్‌ఆర్ ఉద్యోగిగా కాలూరి గురవయ్య (45) పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం ఆయన స్థానిక పంప్‌హౌస్ వద్ద విధులు నిర్వర్తిస్తూ పడిపోయారు. ఇతర సిబ్బంది వచ్చి ఆయన్ను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.



మృతి చెందిన గురవయ్య (పాతచిత్రం)

విద్యుత్తు స్తంభమెక్కి..

మద్దిపాడు,న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలచనకోట ఎస్సీ కాలనీకి చెందిన గుంటూరు మోషే ఇంటికి మూడు రోజులుగా విద్యుత్తు సరఫరా కావడం లేదు. దీంతో స్థానికంగా ఉన్న కొలచనకోట సాయి (30)ని మరమ్మతులు చేయమని కోరారు. ఈ మేరకు సాయి సంబంధిత శాఖాధికారులకు తెలియకుండానే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. నిచ్చెన సాయంతో కరెంట్ స్తంభం ఎక్కగా విద్యుదాఘాతానికి గురై పడిపోయి మృతిచెందారు. మృతునికి భార్య, పది సంవత్సరాల పాప ఉన్నారు.

కూలిన మిద్దె పైకప్పు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే:: మండలంలోని గొల్లపల్లిలో వర్షాలకు ఓ మట్టి మిద్దె పైకప్పు కూలిపోయింది. సానె వెంకటేశ్వర్లు నివాసముంటున్న పాత మట్టి మిద్దె బుధవారం పడిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని సామగ్రి దెబ్బతిందని బాధితులు వాపోయారు.

వర్షం నీరు నిలవకుండా పూడికతీత: కలెక్టర్

ఒంగోలు గ్రామీణం: భారీ వర్షాల నేపథ్యంలో నీరు నిలబడకుండా తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలు మండలం వెంగముక్కపాలెం రోడ్డులోని మదర్‌థెరెసా, బాలినేని కాలనీలను బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. పక్కనే ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగును పరిశీలించి ఆ ప్రాంత వాసులతో మాట్లాడారు. ఒంగోలు నగరంలోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిల్వకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాను రెడ్ జోన్‌గా ప్రకటించిన నేపథ్యంలో యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నీరు ప్రవహిస్తున్న చప్టాల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కూడా నియమించినట్లు వివరించారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. అనంతరం కొప్పోలు-కరవది గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ముదిగొండ వాగు చప్టాను పరిశీలించారు. వరద తీవ్రత తగ్గే వరకు ఎవర్నీ వెళ్లనివ్వొద్దని అధికారులను ఆదేశించారు.



మదర్ థెరెసా కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

9 గంటలు చీకట్లోనే!

❖ మార్కాపురం వైద్యశాలకు నిలిచిన విద్యుత్తు సరఫరా ❖ పనిచేయని జనరేటర్

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం సర్వజన వైద్యశాలకు దాదాపు తొమ్మిది గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో రోగులు హైరానా పడ్డారు. వైద్యశాలలో అంతర్గతంగా ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగలు జామ్ అయి తెగిపోవడంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. వర్షాల కారణంగా కారుమబ్బులు కమ్ముకోవడంతో చిమ్మచీకట్లు అలముకుని రోగులు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల తర్వాత జనరేటర్‌ను ఆన్ చేశారు. అయితే వర్షాల కారణంగా విద్యుత్తు తీగలు జామ్ అవ్వడంతో ఫలితం లేకపోయింది. దీంతో వైద్య సిబ్బంది విద్యుత్తు అధికారులకు సమాచారమివ్వగా ఏడీఈ సీయానాయక్ సిబ్బందిని పంపించారు. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించి ఎట్టకేలకు తీగలను సరిచేయడంతో సాయంత్రం 5 గంటలకు సరఫరా మొదలైంది. ఈ కారణంగా శస్త్ర చికిత్సలను కొన్ని గంటల పాటు నిలిపివేశారు. చరవాణి వెలుగుల్లో వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తించారు. దీనిపై వైద్యశాల పర్యవేక్షణాధికారి డాక్టర్ సావిత్రిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వర్షాల కారణంగా భూమి లోపల ఉన్న విద్యుత్తు తీగలు దెబ్బతిన్నాయని, అయినా శస్త్ర చికిత్సలు కొనసాగించామని చెప్పారు. ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్ వైద్యశాలను సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు.



మార్కాపురం సర్వజన వైద్యశాల



చీకట్లో ఓపీ చూస్తూ..

రహదారిపై నిలిచిన నీరు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు - కర్నూల్ రహదారిలో యల్లయ్య నగర్ పెట్రోలు బంకు వద్ద నిలిచిపోయిన నీటిని అధికారులు యుద్ధప్రాతిపదికన తోడించారు. వాగు కాదు.. కర్నూల్ రాచబాటే శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు రెవెన్యూ, మండల పరిషత్తు అధికారులు స్పందించారు. నాలుగు భారీ మోటార్లను ఏర్పాటు చేసి రహదారి, పక్కనున్న లోతట్టు ప్రాంతంలో నిలిచిన నీటిని బయటకు తొలగించారు. అనంతరం కంకర మిక్చర్ తోలించి జేసీబీ సాయంతో గుంతలను పూడ్పించారు. రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులకు ఊరట లభించింది. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర, సర్పంచి మరియమ్మ, వీఆర్వో రామారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, యాకోబు, తదితరులు పనులను పర్యవేక్షించారు.



నీటిని మోటార్ల సాయంతో తోడుతున్న దృశ్యం

ఇంటికి వస్తున్నానని చెప్పి..శవమై తేలి..

దర్శి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ ఉద్యోగి మృతిచెందారు. ఈ సంఘటన లంకోజనపల్లిరోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దర్శి మండలం కొత్తవెంకటాపురానికి చెందిన జింకల హరిశ్చంద్రారెడ్డి (34) ఎంబీఏ పూర్తిచేసి పొదిలిలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నారు. ప్రతిరోజూ పొదిలి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం దర్శి మండలం రాజంపల్లికి కంపెనీ పనిమీద వెళ్లారు. సాయంత్రం పిల్లలకు అల్పాహారం తీసుకొస్తున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పారు. అయితే అర్ధరాత్రి అయినా తిరిగి రాలేదు, ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె విషయం బంధువులకు చెప్పారు. వారు వెతుకుతుండగా సాగర్ కాలువ గట్టుపై మృతుని ద్విచక్ర వాహనం, ఇంటికి తెస్తున్న వస్తువులు, చరవాణి కనిపించాయి. దీంతో సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. బుధవారం ఉదయం పొదిలి రోడ్డుకు సమీపంలో కాలువలో ఆయన మృతదేహం లభ్యమైంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారా..లేక ప్రమాదవశాత్తూ పడిపోయి మృతిచెందారా అన్న విషయాలు దర్యాప్తులో తేలుతాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.



జింకల హరిశ్చంద్రారెడ్డి (పాతచిత్రం)

వివాహిత ఆత్మహత్యా యత్నం

మార్కాపురం, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. మార్కాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండారెడ్డికాలనీలో నివాసముంటున్న దద్దనాల మల్లికార్జున-జ్యోతి దంపతులు. వీరికి నాలుగేళ్ల క్రితం వివాహంకాగా, ఇద్దరు పిల్లలున్నారు. మల్లికార్జున స్థానికంగా ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంతకాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేధిస్తున్నాడు. దీంతో వారి మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురైన జ్యోతి బుధవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించగా ఆమెను మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్త ను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.